వుదయం

ఖానాపురం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

రైతుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ నాయకుల డిమాండ్.
రాస్తారోకోకు మద్దతు తెలిపిన శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇన్చార్జి పోచంపల్లి.

ఖానాపురం, అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి):
వర్షాలు సకాలంలో కురువక ఎల్ నినో ప్రభావం చాలామంది రైతులు నాట్లు వేసుకోలేదని వేసుకున్న కొద్దిమంది రైతుల పంట పొలాలు నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు వలస పోయే పరిస్థితి ఏర్పడుతుందని తక్షణమే ప్రభుత్వం స్పందించి ఖానాపురం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఎన్ హెచ్ 365 జాతీయ రహదారి రెడ్డి పెద్ద రంగారెడ్డి గార్డెన్ ముందు నర్సంపేట నుండి భద్రాచలం వెళ్లే జాతీయ రహదారిపై భూపాలపల్లి ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జ్ గుగులోతు రామస్వామినాయక్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకట నరసయ్య , ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షులు కోరే సుధాకర్, జిల్లా నాయకుడు వల్లెపు శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిరసన ధర్నా నిర్వహించారు, ఇట్టి రాస్తారోకో నిరసన కార్యక్రమానికి శాసన మండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి హాజరై రాస్తారోకోకు ధర్నాకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతాంగాన్ని పార్టీ నాయకులను ఉద్దేశించి శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి మాట్లాడుతూ ఇట్టి విషయమే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కరువు మండలంగా ప్రకటించే విధంగా పోరాడుతానని పాకాల రైతాంగానికి నియోజకవర్గ ప్రజలకు రైతులకు మహిళలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామసాయం ఉపేందర్ రెడ్డి, ఉపసర్పంచ్లు భుషబోయిన రాజు యాదవ్, సింగ్ సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముచ్చ యాదగిరి రావు, వార్డు సభ్యులు గుండ్లపల్లి విజయ్, మమ్మద్ అజహార్, నాయకులు ఆబోతు అశోక్ యాదవ్, జాటోత్ బాలునాయక్, గొంది నాగేశ్వరరావు,
బానోతు రాజు, గుగులోతు బాలునాయక్, భూస అశోక్, దెబ్బట ఉపేందర్, గంగాపురం రాజు, నేలమర్రి నాగరాజు, రాజేందర్, గంగాపురం అఖిల్, అనిల్, పాపయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక స్వచ్ఛతా కార్యక్రమం – 6.0లో ఎఫ్‌సీఐ వరంగల్ డివిజన్‌లో పరిశుభ్రతా కార్యక్రమాలు

వరంగల్, 29 అక్టోబర్(వుదయం):
భారత ఆహార సంస్థ , వరంగల్ డివిజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక స్వచ్ఛతా కార్యక్రమం - 6.0లో భాగంగా ఈ రోజు ఒకరోజు ప్రత్యేక పరిశుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయాలు, గోదాములు మరియు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచాలనే లక్ష్యంతో వివిధ శుభ్రతా కార్యక్రమాలను చేపట్టారు.
ఈ కార్యక్రమంలో భాగంగా *ఎఫ్‌సీఐ ఎఫ్ఎస్‌డీ కాజీపేటలోని ధాన్య నిల్వ గోదాములలో* సిబ్బంది సహకారంతో గోదాముల మధ్యనున్న నడక మార్గాలను శుభ్రపరిచారు. నేలపై చెల్లాచెదురుగా ఉన్న ధాన్య అవశేషాలను తొలగించి, గోదాములలో పరిశుభ్రత,మెరుగైన నిర్వహణకు ప్రాధాన్యతనిచ్చారు.అదే విధంగా, *కార్మికుల షెడ్ పరిసరాలు, వాహనాల పార్కింగ్ ప్రాంతం, కార్యాలయానికి వెళ్లే రహదారి మరియు ఇతర బహిరంగ ప్రదేశాల్లో* పేరుకుపోయిన చెత్త, ఎండిన ఆకులు, అనవసరమైన మొక్కలు మరియు ఇతర వ్యర్థాలను తొలగిస్తూ శుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణంలోని మరుగుదొడ్లను శుభ్రపరచి, పరిశుభ్రతను మెరుగుపరిచే చర్యలు చేపట్టారు.
పరిసరాలను పచ్చదనంతో నింపే ఉద్దేశంతో కార్యాలయ ప్రాంగణంలోని కుండీలలో పెంచుతున్న మొక్కలకు నీరు పోసి, వాటి నిర్వహణపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించారు. ప్రత్యేక స్వచ్ఛతా కార్యక్రమం - 6.0 ద్వారా పరిశుభ్రతను కేవలం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా, ప్రతిరోజూ పాటించాల్సిన బాధ్యతగా ప్రోత్సహించడం, ఉద్యోగులు మరియు సందర్శకులకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి."పరిశుభ్రమైన ప్రాంగణం - ఆరోగ్యకరమైన వాతావరణం - పచ్చని భవిష్యత్తు"* అనే సందేశంతో ఎఫ్‌సీఐ వరంగల్ డివిజన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

భూపాలపల్లి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జిని సన్మానించిన నేతలు

ఖానాపురం, అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి):
భూపాలపల్లి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ మాజీ ఓడిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్ ను సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు మాద్రాజు వెంకన్న, గ్రామ పార్టీ అధ్యక్షుడు మేకల కుమారస్వామి, నాయకులు పోతురాజు కరుణాకర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూల బొకే అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెన్ను సమ్మయ్య, ముద్దే తిరుపతి, తోట రవి, తాళ్ల సంతోష్, కర్రె రమేష్, పూజారి కుమారస్వామి, పోతరాజు కృష్ణ, పొన్నాల ఎల్లాన్న, అద్దూరి మోహన్ రావు, కత్తుల అనిల్, ఎర్రబెల్లి సంపత్ రావు, ఎస్ నాగేశ్వరరావు, కాసూజ్ మల్లయ్య, కాసాని వెంకటేష్, బత్తిని యాదగిరి, వంగపండ్ల యాకన్న, తక్కలపల్లి ప్రవీణ్, జంగిలి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా 2 వ విఓ భవనం ప్రారంభం.. 2 వ భవనం శంకుస్థాపన

*** పర్వతగిరి ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్**
*** గ్రామ సర్పంచ్ గాడి పెల్లి మహేందర్**

పర్వతగిరి , అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి):
పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామంలో 1 వ నూతన మహిళా సంఘం బిల్డింగ్ ప్రారంభోత్సవం 2 వ నూతన మహిళా సంఘం భవన నిర్మాణానికి వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు ఆదేశానుసారం ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్, అన్నారం గ్రామ సర్పంచ్ గాడి పెల్లి మహేందర్ ప్రారంభోత్సవం, ముగ్గుపోసిన కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్ మరియు అన్నారం గ్రామ సర్పంచ్ గాడి పెల్లి మహేందర్ సంయుక్తంగా ప్రారంభిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి రాష్ట్ర మంత్రి వర్యులు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశానుసారం గ్రామంలో మహిళా సంఘం బిల్డింగ్ ప్రారంభోత్సవం నూతన భవనానికి మొగ్గుబోసే కార్యక్రమం చేయడం చాలా సంతోషం అని సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ అన్నారు.
ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొడుగు ఏకాంత సారయ్య , వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ గొడుగు బిక్షపతి, పిఎసిఎస్ డైరెక్టర్ మోటపోతుల సుదర్శనం, ఏటీఎం రాజీవ్,సీసీ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి నిమ్మల రాజు, గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు భాష బోయిన రామకృష్ణ, మంజంపల్లి నాగరాజు , గాడి పెల్లి రాజబాబు ,బత్తిని జలంధర్ ,రాపోలు అనిత రవీందర్ ,రాధిక సుధాకర్,

దొంత మాల పవన్, కళ్యాణ్, వివోఏలు శైలజ సంధ్య స్రవంతి , వివో అధ్యక్షురాలు అమ్మాజీ ప్రవళిక, స్రవంతి, గ్రామ పుర ప్రముఖులు ఈరగాని సాంబయ్య , రామస్వామి, కృష్ణమోహన్ జనగాం లక్ష్మణ్ ,రామ్మూర్తి, గ్రామపంచాయతీ సిబ్బంది కారోబార్ గుండ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కస్తూర్బా, సైనిక్ స్కూల్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు.
న్యాయవాదులు సునీత, సాంబయ్య, రమేష్.

ఖానాపురం, అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి):
ప్రస్తుత సమాజంలో విద్యార్థులు వివిధ రకాల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాదులు సునీత, సాంబయ్య, రమేష్ విద్యార్థులకు తెలిపారు. మండలంలోని అశోక్ నగర్ గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విశ్వవిద్యాలయం, సైనిక్ స్కూల్ లోని విద్యార్థులకు మండల న్యాయ సేవాధికార సంస్థ, నరసంపేట్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి న్యాయవాదులు మాట్లాడుతూ విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, విధులు, బాలల హక్కులు, విద్యాహక్కు చట్టం, బాల్య వివాహాల నిరోధం, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, మహిళలు మరియు బాలికల రక్షణ చట్టాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉచిత న్యాయసహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి రామ్మోహన్, స్పెషల్ ఆఫీసర్ మేనక, ప్రధానోపాధ్యాయులు సురేందర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పోచమ్మ గుడి రహదారిలో మోరీల నిర్మాణం

భూపాలపల్లి, అక్టోబర్ 29 (వుదయం విలేకరి):
మహాదేవపూర్ మండలం పెద్దంపేట గ్రామపంచాయతీలోని 5వ వార్డు ఎస్టి కాలనీలో పోచమ్మ గుడికి వెళ్లే రహదారి గత కొన్ని సంవత్సరాలుగా అధ్వానంగా ఉండి ప్రజలు ఇబ్బంది పడేవారు.గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సర్పంచ్ బీసుల లావణ్యరాజేష్ తక్షణమే స్పందించి జేసీబీ ద్వారా నిర్మాణ పనులు చేపట్టి మోరీలు వేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గద్దం రాజు గౌడ్, వార్డు మెంబర్ చిదం సంజీవ్, గోగు అశోక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గావిడి బాపు తదితరులు పాల్గొన్నారు.

జెండా కర్రను తొలగించి కాంగ్రెస్ ఫ్లెక్సీలు కట్టడంపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ డిమాండ్.

భూపాలపల్లి అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి):
జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండా, జెండా కర్రను తొలగించి, ఆ ప్రదేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై ఎమ్మార్పీఎస్ జెండాను, జెండా కర్రను తొలగించిన వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రామ్ రామ్ చందర్ మాదిగ మరియు ఎమ్మార్పీఎస్ టేకుమట్ల మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్‌కు సంబంధించిన జెండాను, జెండా కర్రను

తొలగించి అదే ప్రదేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఫ్లెక్సీలు కట్టడం సరైన చర్య కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి సంఘానికి, ప్రతి సంస్థకు తమ భావాలను వ్యక్తం చేసుకునే హక్కు ఉంటుందని తెలిపారు. ఒక సంఘానికి సంబంధించిన జెండాను తొలగించడం వల్ల ఆ సంఘం నాయకులు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటాయని అన్నారు.ఈ ఘటనకు బాధ్యులైన వారిని అధికారులు గుర్తించి విచారణ జరపాలని ఆయన కోరారు. జెండా, జెండా కర్రను తొలగించిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని సంబంధిత అధికారులను కోరారు.మండల కేంద్రంలో జరిగిన ఈ ఘటనపై
అధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని రామ్ రామ్ చందర్ మాదిగ మచ్చ శ్రీకాంత్ మాదిగ డిమాండ్ చేశారు.

కెసిఆర్ ని సీఎం చేయడమే స్వర్గీయ పెద్ది ఆశయం మనందరి లక్ష్యం

వరంగల్ నల్లగొండ ఖమ్మం పట్టబద్దుల ఓటు నమోదు కార్యక్రమాన్ని గడువులోపు పూర్తి చేయాలి.
శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జ్ పోచంపల్లి.

ఖానాపురం, అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి):
మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుని ముఖ్యమంత్రి చేయడమే స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి ఆశయం మనందరి లక్ష్యమని రాష్ట్ర ప్రజలందరికీ కోరిక అని శాసన మండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి
రాష్ట్ర ప్రజలకు నాయకులకు రైతులకు కార్యకర్తలకు తెలిపారు. మండల కేంద్రంలోని రెడ్డి పెద్ద రంగారెడ్డి గార్డెన్లో వరంగల్ నల్లగొండ ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన మండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జ్ పోచంపల్లి హాజరై నాయకులకు ఎమ్మెల్సీ ఎన్నికల క్లస్టర్ ఇన్చార్జిలకు బాధ్యులకు ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమంపై పలు సూచనలు చేసి నవంబర్ 6లోపు ఓటు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి మాట్లాడుతూ వరంగల్ నల్లగొండ ఖమ్మం జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలలో నియోజకవర్గంలోని పట్టబద్రులందరినీ ఓటరుగా నమోదు చేసి అత్యధిక మెజార్టీతో మన అభ్యర్థిని గెలిపించాలని స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే పెద్దన్న ఆశయాన్ని నెరవేర్చాలన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల మండల గ్రామాల క్లస్టర్ ఇంచార్జులతో సమావేశం ఏర్పాటు చేసి ఓటు నమోదు కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించి గడువులోపు ఓటు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని క్లస్టర్ ఇన్చార్జిలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జ్ గుగులోతు రామస్వామినాయక్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనరసయ్య , ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కోరే సుధాకర్, జిల్లా నాయకుడు వల్లెపు శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామసాయం ఉపేందర్ రెడ్డి, ఉపసర్పంచ్లు భుషబోయిన రాజుయాదవ్, సింగ్ సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముచ్చ యాదగిరిరావు, వార్డు సభ్యులు గుండ్లపల్లి విజయ్, మమ్మద్ అజహార్, నాయకులు ఆబోతు అశోక్ యాదవ్, ఉడుగుల రాజుయాదవ్, పోతరాజు కరుణాకర్, జాటోత్ బాలునాయక్,
గొంది నాగేశ్వరరావు, బానోతు రాజు, గుగులోతు బాలునాయక్, భూస అశోక్, దెబ్బట ఉపేందర్, గంగాపురం రాజు, నేలమర్రి నాగరాజు, రాజేందర్, గంగాపురం అఖిల్, అనిల్, పాపయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు షాక్.. కాంగ్రెస్‌లోకి చర్లపల్లి గ్రామ సర్పంచ్ బండి రేణుక శంకర్

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న సర్పంచ్.

పరకాల అక్టోబర్ 29 (వు దయం ప్రతినిధి):
నడికూడ మండలం చర్లపల్లి గ్రామ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. చర్లపల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతి బండి రేణుక శంకర్ బీఆర్ఎస్ పార్టీని వీడి పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు ఆమెతో పాటు పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.
కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పట్ల ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు బండి రేణుక శంకర్ తెలిపారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గారి నాయకత్వంలో గ్రామాభివృద్ధికి మరింత కృషిచేయడంతోపాటు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు నూతనంగా పార్టీలో చేరిన వారిని అభినందిస్తూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.
సర్పంచ్ బండి రేణుక శంకర్‌తో పాటు మరో 20 మంది కాంగ్రెస్‌లో చేరిక
బండి రేణుక శంకర్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన బండి శి

వకృష్ణ, శరత్, రామస్వామి, నితిన్, సుమన్, గణేష్, రమాకాంత్ తదితరులు సుమారు 20 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరి చేరికతో చర్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు కొత్త ఊపు వచ్చినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరిక కార్యక్రమం చర్లపల్లి గ్రామ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.
నూతనంగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

జాతీయ కోకో పోటీల్లో తెలంగాణకు రజత పతకం

భూపాలపల్లి, అక్టోబర్ 29 (వుదయం విలేకరి):
హర్యానాలో నిర్వహించిన జాతీయ స్థాయి కోకో పోటీల్లో తెలంగాణ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. ఈ పోటీల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం సూరారం గ్రామానికి చెందిన ములకల సూర్యచరణ్, రిష్మిత్ ప్రతిభ కనబరిచి తెలంగాణ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.సూరారం గ్రామానికి చెందిన ఈ యువ క్రీడాకారులు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హర్యానాలో జరిగిన జాతీయస్థాయి కోకో పోటీల్లోనూ తమ ప్రతిభను చాటుతూ తెలంగాణ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచేందుకు కృషి చేశారు. జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్రం రెండో స్థానంలో నిలవడం ఎంతో సంతోషంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. వరంగల్ లోని ఓ స్కూల్ నుండి ఎంపికై తమ కుమారులు ములకల సూర్యచరణ్, రిష్మిత్ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకం సాధించడం మరింత

ఆనందంగా ఉందని వారు హర్షం వ్యక్తం చేశారు.సూరారం గ్రామానికి చెందిన యువకులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం పట్ల గ్రామస్థులు సైతం అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సబ్ స్టేషన్ లో పట్టపగలే మద్యం సేవిస్తున్న లైన్ ఇన్స్పెక్టర్

ఖానాపురం, అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి):
మండలంలోని మంగళవారిపేట విద్యుత్తు సబ్ స్టేషన్ లో మండలంలో పనిచేసే విద్యుత్తు లైన్ ఇన్స్పెక్టర్ తో పాటు మరికొంతమంది విద్యుత్ శాఖలో వివిధ మండలాలలో పనిచేసే వివిధ స్థాయి విద్యుత్ శాఖకు సంబంధించిన అధికారు పట్టపగలే మద్యం సేవించడం రైతులు ప్రజలు ఆశ్చర్యపోయారు. పట్టపగలే విద్యుత్ సబ్ స్టేషన్ లో మద్యం సేవించడం దురదృష్టకరమని ప్రజలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయంపై గ్రామ రైతులు ప్రజలు విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చనిపోయిన కుటుంబాలకు పరామర్శ - బియ్యం పంపిణీ

వర్ధన్నపేట , అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి):
ఇల్లంద గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన టిఆర్ఎస్ నాయకులు తూల యాకయ్య,మచ్చ కొమురయ్య కుటుంబాలను పరామర్శించి బియ్యం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ చనిపోయిన కుటుంబ

సభ్యులకు ఆదుకుంటామని,బిఆర్ఎస్ పార్టీ అన్నివేళల అండగా ఉంటుందని అన్నారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తూల్ల కుమారస్వామి, మాజీ ఎంపిటిసి గోడిశాల శ్రీనివాసులు,గ్రామ పార్టీ అధ్యక్షులు అంబటి ఎల్ల స్వామి,మాజీ దేవస్థానం చైర్మన్ ఏరుగొండ వేణుగోపాల రావు,మాజీ వార్డు సభ్యులు పెద్దగోని కవిరాజ్,సీనియర్ నాయకులు శ్రీరామోజు ఏకాంబచారి,మాజీ దేవస్థాన డైరెక్టర్ మునుకుంట్ల రాజేష్, మండల యువజన నాయకులు బొడ్డుపల్లి శ్రీకాంత్,తూల రవి,తూల కుమారస్వామి పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పర్యటన

ఎల్‌నినో ప్రభావంపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం

భూపాలపల్లి, అక్టోబర్ 29 (వుదయం విలేకరి) :
రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం (నేడు)భూపాలపల్లి జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎల్‌నినో ప్రభావంపై వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులపై కచ్చితమైన సమాచారంతో నివేదికలు సిద్ధం చేసుకొని సమీక్ష

సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. గత ఏడాది, ప్రస్తుత ఏడాది ఎల్‌నినో ప్రభావానికి సంబంధించిన వివరాలతో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) సిద్ధం చేసి సమర్పించాలని స్పష్టం చేశారు

మెరుగైన ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులు చేయాలి

అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహేష్ నాయక్.

ఖానాపురం, అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి):
విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధన చేయాలని అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహేష్ నాయక్ ఉపాధ్యాయులకు తెలిపారు. మండలంలోని అశోక్ నగర్ శివారులోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను అకాడమిక్ మానిటింగ్ అధికారి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని, వంట గదిని, స్టోర్ రూమ్ను, తరగతి గదులను క్షుణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల రికార్డులను విద్యార్థుల హాజరు పట్టికను మధ్యాహ్న భోజన మెనూను పరిశీలించి విద్యార్థులు చదువు పనితీరుపై విద్యార్థులను వివిధ రకాల ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో విద్యార్థుల చదువుపై పలు విషయాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో జెడ్రల్ ఈక్విటీ కోఆర్డినేటర్ విజయ్ కుమార్, ఇన్చార్జ్ ఎంఈఓ వెంకట్ రామ్, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మేనక, ఉపాధ్యాయ బృందము విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూకల్ లో పంట కుంటలు, సోక్ పిట్స్ పరిశీలన

చిట్యాల, అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి):
చిట్యాల మండలం జూకల్ గ్రామంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి పోరిక బాలకృష్ణ వి బి జీ రామ్ జీ జలసిరి ప్రోగ్రామ్ లో భాగంగా గురువారం రైతుల పంట కుంట (ఫార్మ్ పాండ్), కమ్యూనిటీ సోక్ పిట్స్ వర్క్స్ ను పరిశీలించి రైతులతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఎం ఏ. అలీమ్ ఏపీవో,

సుధాకర్ ఈసీ, స్రవంతి, చిరంజీవి, నవీన్ పంచాయతీ కార్యదర్శి, ఎల్గొండ సంధ్యారాణి సర్పంచ్, మురళి మారి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి, ఐకేపీ సీసీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబు పర్యటన

చిట్యాల,అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి)
నేడు చిట్యాల మండలంలో రాష్ట్ర ఐటీ పరిష్కరణ శాఖ మంత్రి శ్రీధర్ బాబు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పర్యటిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దబ్బేట అనిల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు చిట్యాల మండలంలోని ఒడితల గ్రామంలో 2 కోట్ల రూపాయలతో

33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణ పనులు పూర్తయిన సందర్భంగా నేడు శుక్రవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభిస్తారు అని తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

పట్టభద్రులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలి

48వ డివిజన్ ఇన్‌చార్జ్ మెట్టుపల్లి రమేష్
వైస్ ప్రెసిడెంట్ శ్రీ రామోజీ శ్రీనాథ్
బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓట్ల నమోదుపై విస్తృత ప్రచారం

కాజీపేట్ అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి):-
రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన పట్టభద్రులందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకుని, వినియోగించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ 48వ డివిజన్ ఇన్‌చార్జ్ మెట్టుపల్లి రమేష్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ రామోజీ శ్రీనాథ్ పిలుపునిచ్చారు. బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, స్థానిక నాయకత్వ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో పట్టభద్రుల ఓట్ల నమోదుపై బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు

బోనాలతో ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల వినూత్న నిరసన

17వ రోజుకు చేరిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమ్మె

వరంగల్, అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి) :
జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరవధిక సమ్మె గురువారానికి 17వ రోజుకు చేరుకుంది. వరంగల్ నగరంలోని పోచం మైదాన్ సర్కిల్‌లో ఉద్యోగులు బోనాలు ఎత్తుకొని వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం పోచమ్మ తల్లి చరణాల వద్ద డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఉంచారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి. భరత్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 78 క్యాడర్లలో పనిచేస్తున్న సుమారు 17,541 మంది ఉద్యోగులకు తక్షణమే ఉద్యోగ క్రమబద్ధీకరణ (రెగ్యులరైజేషన్) చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత/ఇన్సూరెన్స్, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, సమాన పనికి సమాన వేతనం, 100% గ్రాస్ శాలరీ, లోయాల్టీ బోనస్ సహా 16 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలోఎన్ హెచ్ ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, ఆర్‌బీఎస్‌కే ఆర్గనైజర్ డాక్టర్ గుండా రవీందర్, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ రామ్ రాజు, పలువురు వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, ఫార్మసీ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎమ్‌లు, అకౌంటెంట్లు మరియు ఇతర కేడర్ల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దివ్యాంగ ఉద్యోగులందరూ పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోవాలి

– కందనూలు నిరంజన్

నాగర్ కర్నూల్ రూరల్, అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి) : 2027 మార్చిలో జరగనున్న హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్ నగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన దివ్యాంగ ఉద్యోగులందరూ పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోవాలని దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కందనూలు నిరంజన్ పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఓటు నమోదుకు నవంబర్ 6 తుది గడువు అని, అర్హులైన దివ్యాంగ ఉద్యోగులు ఆన్ లైన్ ద్వారా లేదా ఫారం-18 ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనదని, ఈ అవకాశాన్ని నిర్లక్ష్యం చేయవద్దని కోరారు.జిల్లాలోని డివిజన్, మండల బాధ్యులు ప్రత్యేక చొరవ తీసుకొని తమ పరిధిలోని దివ్యాంగ ఉద్యోగులందరికీ అవగాహన కల్పించి ఓటు నమోదు చేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అయిజలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అదనపు పోల్, ఏబీ స్విచ్‌ల ఏర్పాటు

అయిజ అక్టోబర్ 29
వుదయం ప్రతినిధి

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఏడీఈ నీలి గోవిందు తెలిపారు. ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా అయిజ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అదనపు విద్యుత్ పోల్‌తో పాటు ఏబీ స్విచ్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఇతర సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పట్టణంలోని ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వినియోగదారులను ఏడీఈ నీలి గోవిందు కోరారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు విద్యుత్ శాఖ కృషి చేస్తుందని పేర్కొన్నారు.

17వ రోజుకు చేరుకున్న ఎన్ హెచ్ ఎం రిలే దీక్షలు

నారాయణపేట టౌన్ అక్టోబర్ 29(వుదయం ప్రతినిధి) తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం టీజీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి నారాయణపేట జిల్లాలో 17వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం గౌరవ అధ్యక్షులు బిక్షపతి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తూ ఆరోగ్య శాఖలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తమకు ఉద్యోగ భద్రత లేకపోవడం ఆవేదన కలిగిస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రజలకు వైద్య సేవలు అందించడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తున్నామని వివరించారు.

సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించి, తమను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వెంకట రమణ, కోశాధికారి రాఘవేందర్, సభ్యులు నరసింహారావు సగరి, మోనేష్ చారి, తిరుపతి, శ్రీలత, అర్చన, ఐశ్వర్య, నవ్య దీప్తి, శ్వేత శ్రీ, రామస్వామి, వినోద్, గాయత్రి, అజారుద్దీన్, ఆశ బి, రామేశ్వరి, అపర్ణ, నాగజ్యోతి, పుష్ప, సుమిత్ర, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి పిలుపు
మునగాలలో బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

మునగాల, అక్టోబర్ 29 (వుదయం):తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి పట్టభద్రులు తగిన గుణపాఠం చెప్పాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి పిలుపునిచ్చారు. మునగాల మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ఆయన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మునగాల మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విజయసింహారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటు ద్వారా కాంగ్రెస్ పార్టీకి తగిన సమాధానం చెప్పాలని కోరారు. కర్ణాటకలో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఎలాంటి తీర్పు ఇచ్చారో, అదే విధంగా తెలంగాణలోనూ కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించడం ద్వారా ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు.

అనంతరం మునగాల మండల కేంద్రంలోని సాయి గాయత్రి పాఠశాలలో పట్టభద్రులను కలిసి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థికి తమ ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు కోరారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కందిబండ సత్యనారాయణ, గ్రామ అధ్యక్షుడు ఉడుం కృష్ణ, సుంకరి అజయ్‌కుమార్, కోలా ఉపేందర్, గడ్డం లింగయ్య, వల్లోజు వసంతకుమార్, వల్లోజు నరసింహారావు, ఎస్.కె. సైదా, నారగాని వెంకన్న, ఎస్.కె. జానీ తదితరులు పాల్గొన్నారు.

వర్షం దెబ్బకు రైతు ఆశలపై నీళ్లు!

ఎండ, ఎల్‌నినో ప్రభావంతో నీరందక అవస్థలు.. తీరా చేతికొచ్చే సమయంలో తుఫాను వానతో నేలవాలిన వరి
12 ఎకరాల కౌలు భూమిలో తీవ్ర నష్టం.. పెట్టుబడులైనా దక్కుతాయని ఆశించిన రైతుకు కన్నీరే మిగిలింది!

మునగాల, అక్టోబర్ 29 (వుదయం):ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతుకు చివరి క్షణంలో ప్రకృతి కన్నెర్ర చేసింది. ఎండలు, ఎల్‌నినో ప్రభావంతో సాగునీరు అందక ఇప్పటికే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతు.. ఎలాగోలా పంటను కాపాడుకుంటూ వచ్చాడు. పంట చేతికొచ్చే సమయంలో తుఫాను ప్రభావంతో కురిసిన వర్షం, వీచిన బలమైన గాలులు అతని ఆశలను నేలమట్టం చేశాయి. పంట నష్టంతో అప్పులు ఎలా తీర్చాలో, పెట్టుబడులు ఎలా రాబట్టుకోవాలో తెలియక ఆ రైతు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు.

కౌలు భూమిలో కష్టాల సాగు..

మునగాల మండల కేంద్రానికి చెందిన ముంత లింగయ్య అనే రైతు తన జీవనాధారం కోసం కౌలుకు తీసుకున్న సుమారు 12 ఎకరాల భూమిలో వరి సాగు చేస్తున్నాడు. సాగు ప్రారంభం నుంచి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడు. ఎండలు, ఎల్‌నినో ప్రభావంతో సాగునీరు సకాలంలో అందక పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడ్డాడు. అయినప్పటికీ ధైర్యం కోల్పోకుండా పంటను సాగు చేస్తూ, కనీసం పంట చేతికొస్తే పెట్టిన పెట్టుబడులైనా తిరిగి వస్తాయని ఆశపడ్డాడు.

చేతికొచ్చే సమయంలో ప్రకృతి దెబ్బ!

పంట కోతకు సిద్ధమవుతున్న తరుణంలో రెండు రోజుల క్రితం తుఫాను ప్రభావంతో కురిసిన వర్షానికి తోడు బలమైన గాలులు వీయడంతో వరి పైరు నేలవాలిపోయింది. నెలల తరబడి శ్రమించి పండించిన పంట కళ్లముందే నేలకొరగడంతో రైతు ఆశలు అడియాశలయ్యాయి. ఇప్పటికే సాగునీటి కొరతతో దిగుబడిపై ప్రభావం పడగా, ఇప్పుడు అకాల వర్షం, ఈదురుగాలులు మరింత నష్టాన్ని మిగిల్చాయి. పంట నేలవాలడంతో ధాన్యం నాణ్యత దెబ్బతినడంతో పాటు దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతు ఆందోళన చెందుతున్నాడు.

పెట్టుబడులైనా దక్కుతాయనుకుంటే..

కౌలు చెల్లింపులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సాగునీరు, కూలీల ఖర్చుల కోసం ఇప్పటికే పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టిన లింగయ్యకు పంట నష్టం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. పంట దిగుబడి ద్వారా కనీసం పెట్టుబడులైనా తిరిగి వస్తాయని భావించిన తరుణంలో ప్రకృతి వైపరీత్యం రూపంలో ఎదురైన దెబ్బతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. కౌలు రైతులకు పంట నష్టం వాటిల్లితే ఆర్థిక భారం మరింత పెరుగుతుందని, పెట్టుబడులు తిరిగి రాకపోతే అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉందని ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

అధికారులు ఆదుకోవాలి..

పంట నష్టంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముంత లింగయ్య వంటి రైతులను వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు. అకాల వర్షాలు, ఈదురుగాలుల వల్ల నష్టపోయిన పంటలకు ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితిని గుర్తించి, వారికి కూడా ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంట పండితేనే పండుగ.. నష్టపోతే కన్నీళ్లేనా?

రైతు కష్టానికి ప్రకృతి సహకరించకపోతే అతని బతుకు ఎంతటి దయనీయంగా మారుతుందో ముంత లింగయ్య పరిస్థితి అద్దం పడుతోంది. సాగునీటి కొరతను తట్టుకుని పంటను కాపాడుకున్న రైతుకు, చివరి దశలో కురిసిన వర్షం తీరని నష్టాన్ని మిగిల్చింది. ఆరుగాలం శ్రమించిన రైతన్నకు అండగా నిలవాల్సిన సమయం ఇదే. సంబంధిత అధికారులు స్పందించి పంట నష్టాన్ని పరిశీలించి, బాధిత రైతును ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నంబావి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారుల హాజరు
చిన్నంబావి మండలం 29 వుదయం రిపోర్టర్

చిన్నంబావి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం (30-10-2026) ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం (జనరల్ బాడీ మీటింగ్) మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్ గౌడ్ తెలిపారు. మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకానున్నారు. మండల అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, వివిధ శాఖల పనితీరు తదితర అంశాలపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది అని ఈ సందర్భంగా ఎంపీడీవో సువర్ణ ఆదర్శ్ గౌడ్ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులని ఈ సందర్భంగా తెలియజేశారు. సమావేశ వివరాలు: తేదీ: 30 అక్టోబర్ 2026, శుక్రవారం సమయం: ఉదయం 10:30 గంటలకు వేదిక: మండల పరిషత్ కార్యాలయం, చిన్నంబావి అధ్యక్షత: మండల ప్రత్యేక అధికారి గమనిక: సమావేశంలో చర్చించే అంశాల వివరాలు అందుబాటులో ఉంటే, వాటిని కూడా వార్తలో చేర్చి మరింత సమగ్రంగా రూపొందించవచ్చు.

రోడ్డు ప్రమాద కేసులో శిక్ష

- ఎస్ఐలు, సీఐని అభినందించిన అడిషనల్ ఎస్పీ

బిజినేపల్లి, అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి) : రోడ్డు ప్రమాద కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించారు.బిజినేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 9 ఏళ్ల క్రితం నమోదైన క్రైమ్ నం. 64/2016 కేసులో నలుగురు మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ కేసులో నాగర్ కర్నూల్ కోర్టు మంగళవారం తీర్పు ఇస్తూ.. పెంట్లవెల్లి గ్రామానికి చెందిన నిందితుడు జహంగీర్ కు 3 నెలల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించింది.ఈ కేసులో చాకచక్యంగా దర్యాప్తు చేసి సాక్ష్యాలు సేకరించి నిందితుడికి శిక్ష పడేలా చేసిన అప్పటి ఎస్ఐ వీరబాబు, ప్రస్తుత ఎస్ఐ షంషుద్దీన్, సీఐ అశోక్ రెడ్డి, కోర్టు కానిస్టేబుళ్లు రమేష్, ఆంజనేయులును అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించారు.

పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
కొండపల్లి పాఠశాలలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మిక తనిఖీ

గద్వాల, అక్టోబర్ 29 వుదయం బ్యూరో పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధన చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.గురువారం గద్వాల మండలం కొండపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల హాజరు, విద్యాబోధన, ఇటీవల నిర్వహించిన పరీక్షల ఫలితాలు, ఉపాధ్యాయుల హాజరు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలను పరిశీలించారు. గతంలో పాఠశాలలో 90 శాతం ఉత్తీర్ణత నమోదైన నేపథ్యంలో ఈసారి వంద శాతం ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు.వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటలపాటు రెమిడీయల్ తరగతులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా గణితం, భౌతికశాస్త్రంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల మార్కులను విశ్లేషించి, ఏ సబ్జెక్టులో, ఏ అధ్యాయంలో బలహీనంగా ఉన్నారో గుర్తించి వ్యక్తిగత అభ్యసన ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ఉదయం వేళల్లో చదువుకోవడం, ఇంటివద్ద అభ్యాసం చేయడం, పాత ప్రశ్నపత్రాలను సాధన చేయడం, అసైన్‌మెంట్లు పూర్తి చేయడం వంటి అలవాట్లను పెంపొందించాలన్నారు.పరీక్షల పట్ల విద్యార్థుల్లో భయాన్ని తొలగించి ఆత్మవిశ్వాసాన్ని పెంచాలని, నిర్ణీత గడువులో సిలబస్ పూర్తి చేసి పునశ్చరణకు తగిన సమయం కేటాయించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని, తరచూ గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని తిరిగి పాఠశాలకు రప్పించాలని ఆదేశించారు.మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనంపాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యత, కూరగాయల వినియోగం, వంటశాల పరిశుభ్రత, రోజువారీ మెనూ అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కేవలం అన్నం, సాంబారుతో సరిపెట్టకుండా మెనూలో పేర్కొన్న అన్ని వంటకాలను అందించాలని స్పష్టం చేశారు. వంట సిబ్బంది కొరత ఉన్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించడంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. గురువారం నిర్ణీత మెనూ ప్రకారం వంట చేయనందున సంబంధిత ఏజెన్సీని తొలగించి కొత్త వారిని నియమించాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు.యూనిఫాంలు, పాఠ్యపుస్తకాల పంపిణీపై ఆరావిద్యార్థులకు పంపిణీ చేసిన యూనిఫాంలు, వాటి కొలతలు, కుట్టింపు, వినియోగంపై కలెక్టర్ ఆరా తీశారు. యూనిఫాంలు అందినప్పటికీ కొందరు విద్యార్థులు ధరించకపోవడంపై ప్రశ్నించారు. కొలతలు సరిగా లేకపోతే అవసరమైన మార్పులు చేయించి, ప్రతి విద్యార్థి యూనిఫాంలో పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు.పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్ పంపిణీ వివరాలను తెలుసుకున్నారు. కొన్ని పుస్తకాలు, పార్ట్-2 పాఠ్యసామగ్రి ఇంకా అందాల్సి ఉందని ఉపాధ్యాయులు తెలపగా, విద్యార్థుల చదువుకు అంతరాయం కలగకుండా వాటిని సకాలంలో అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను తరచూ సందర్శించి విద్యాబోధన, విద్యార్థుల హాజరు, భోజన పథకం అమలును పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, వ్యవసాయానికి నీటి సరఫరా తదితర అంశాలపై సర్పంచ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సర్పంచ్ కృష్ణారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, గద్వాల మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నాగర్ కర్నూల్, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర మాలల జేఏసీ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్ గా మద్దెల చంటి, యువజన చైర్మన్ గా గోరటి సూర్యనారాయణ ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర చైర్మన్ చెరుకు రామచందర్, వర్కింగ్ చైర్మన్ మంత్రి నరసింహయ్య, కో-చైర్మన్ పంబలి సుధాకర్ హాజరయ్యారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి మాలల జేఏసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.త్వరలో ఉమ్మడి 10 జిల్లాల్లో మాలల హక్కుల పరిరక్షణ కోసం బస్సు యాత్ర చేపట్టనున్నట్లు రాష్ట్ర నాయకత్వం ప్రకటించింది.

గ్రామాభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

మహబూబ్‌నగర్

మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామంలో మండల ప్రత్యేక అధికారి,జిల్లా పౌరసరఫరాల అధికారి గంప శ్రీనివాస్ గురువారం పర్యటించి గ్రామపంచాయతీ కార్యాలయం, ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో హాజరు, మూవ్‌మెంట్ రిజిస్టర్లతో పాటు ఇతర రికార్డులను పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ, పన్నుల వసూళ్లు, గ్రామాభివృద్ధి పనుల పురోగతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అన్ని రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.ప్రాథమికోన్నత పాఠశాలలో తరగతి గదులను పరిశీలించి, మధ్యాహ్న భోజన నాణ్యత, పరిమాణాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లల హాజరు, ఆహార నాణ్యతను పరిశీలించారు. కేంద్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించి మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థుల కోసం భోజనశాల నిర్మించాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువచ్చారు.

అనంతరం గ్రామంలోని వివిధ కాలనీలు, ఆవాస ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. డ్రైనేజీ కాలువల శుభ్రత పనులు కొనసాగుతున్న తీరును గమనించారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్య పనులను వేగవంతం చేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

మద్దిగట్ల గ్రామ పంచాయతీలో విజయవంతంగా పూర్తయిన 'డ్రైన్ ఎండ్ సోక్ పిట్' నిర్మాణం - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అభినందనలు

మహబూబ్ నగర్,

మహబూబ్ నగర్ జిల్లా, భూత్పూర్ మండలం పరిధిలోని మద్దిగట్ల గ్రామ పంచాయతీలో గ్రామ అభివృద్ధి మరియు పారిశుద్ధ్య రంగంలో మరో మైలురాయి సాధించబడింది. గ్రామంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ చేపట్టిన 'డ్రైన్ ఎండ్ సోక్ పిట్' నిర్మాణం విజయవంతంగా పూర్తయింది.గ్రామ సర్పంచ్ నతీ సురేష్ ఆధ్వర్యంలో మరియు మండల టీమ్ సహకారంతో చేపట్టిన ఈ వినూత్న పారిశుద్ధ్య కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి కోసం సర్పంచ్, పంచాయతీ సిబ్బంది మరియు మండల టీమ్ చూపుతున్న చొరవను, నిరంతరం శ్రమిస్తున్న తీరును కలెక్టర్ గారు అభినందించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నతీ సురేష్ మాట్లాడుతూ.. గ్రామాన్ని ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు. ఈ పనులను గుర్తించి ప్రోత్సహించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ.. తమ గ్రామ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న మండల టీమ్‌కు, అధికారులకు మరియు గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్వచ్ఛ భారత్ నినాదానికి అనుగుణంగా భవిష్యత్తులోనూ మరిన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అందరి సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేస్తామని వారు పేర్కొన్నారు.

పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా
పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు గుర్తించిన ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా చర్యలను వేగవంతం చేసి, పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. బాలానగర్ జాతీయ రహదారి పై నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జ్ వద్ద రోడ్డు పనులు నవంబర్ 15లోగా ఒకవైపు రహదారిపై ట్రాఫిక్ ప్రారంభించాలని, మరోవైపు పనులను నవంబర్ 30లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్ . పి డి. జానకితో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ రహదారి భద్రతా పనులు, ప్రమాదకర ప్రాంతాల్లో చేపట్టిన చర్యలు, పెండింగ్ పనుల పురోగతిని సమీక్షించారు. పలుమార్లు గడువులు ఇచ్చినా పనులు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నచిన్న సమస్యలను సాకుగా చూపకుండా క్షేత్రస్థాయిలో పనులు వేగంగా పూర్తి చేయాలని, రోజువారీగా పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు.బాలానగర్ వద్ద కాంక్రీటు పనులు, కొంతమేర తారు పనులు పూర్తయ్యాయని, బిటుమెన్ కొరత కారణంగా డీబీఎం పనుల్లో జాప్యం జరుగుతోందని అధికారులు వివరించారు. పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలేపల్లి వద్ద పెండింగ్ పనులను నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని, రాజాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద పనులను నిర్దేశిత గడువులోగా ముగించాలని ఆదేశించారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

ముదిరెడ్డిపల్లి వద్ద అండర్‌పాస్, ఇరువైపులా సర్వీసు రోడ్లు, అదనపు అండర్‌పాస్ నిర్మాణ ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు. అక్కడ ఆలయ తరలింపు, ఆక్రమణల తొలగింపు, పరిహారం చెల్లింపులకు సంబంధించిన సమస్యలను తదుపరి సమావేశంలోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పరిహారం చెక్కుల చెల్లింపుల్లో సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని, ఆలయ తరలింపునకు అవసరమైన అంచనాలు రూపొందించి సంబంధిత వర్గాలతో చర్చించాలని సూచించారు. గతంలో ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో రహదారిపై అవసరమైన భద్రతా ఏర్పాట్లు తక్షణమే చేపట్టాలని స్పష్టం చేశారు.జడ్చర్ల బస్టాండ్ సమీపంలో రహదారి

భద్రతకు అవసరమైన మార్పులపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని సూచించారు. దేవరకద్ర రహదారిలో ట్రాక్టర్ షోరూమ్ సమీపంలో, బండమీదిపల్లి వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూత్పూర్ నుంచి దిమిటిపల్లి మీదుగా ఫ్లైఓవర్ వరకు ఉన్న రహదారిపై ఇటీవల ఆరు ప్రమాదాలు జరిగినట్లు అధికారులు వివరించగా, ప్రమాదాలకు కారణాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు, సూచికలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

రహదారులపై డివైడర్లు, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలకు సంబంధించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైన చోట డివైడర్లలో మార్పులు చేయడంతో పాటు విద్యుత్ స్తంభాలను మార్చి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

బైపాస్ రోడ్డుపై అక్రమ దుకాణాలపై చర్యలు

మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డు పరిసరాల్లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాత్రివేళ ప్రమాదాలు జరగకుండా పోలీసు, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బైపాస్ రోడ్డుపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రాత్రి పర్యవేక్షణను పెంచాలని పోలీసు అధికారులకు, అవసరమైన ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

వాహన తనిఖీలపై నివేదిక ఇవ్వాలి

రవాణా శాఖ అధికారులు ప్రతి నెల నిర్వహిస్తున్న వాహన తనిఖీల వివరాలను తదుపరి సమావేశంలో సమగ్రంగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. తనిఖీ చేసిన వాహనాల సంఖ్య, నమోదు చేసిన కేసులు, అవసరమైన ధ్రువపత్రాలు లేని వాహనాలపై తీసుకున్న చర్యలు, విధించిన జరిమానాల వివరాలను అందించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించేలా అవగాహన కల్పించడంతో పాటు నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ప్రధానమంత్రి రాహత్ పథకం కింద ఆర్థిక సహాయం

రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన 24 గంటల్లోగా సమాచారం అందించడం, బాధితులను సకాలంలో ఆసుపత్రికి తరలించడం ప్రధానమంత్రి రాహత్ పథకం కింద రూ. 1.50 లక్ష ఆర్థిక సహాయం పొందేందుకు కీలకమని తెలిపారు. 108 అత్యవసర సేవల సిబ్బంది ప్రమాద బాధితుల వివరాలను వెంటనే సంబంధిత అధికారులకు అందించేలా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

రోడ్డు భద్రతకు సంబంధించిన చిన్న సమస్యలను సైతం నిర్లక్ష్యం చేయకుండా, ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడంకంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పెండింగ్ పనులను తదుపరి సమావేశంలోగా పరిష్కరించి, పురోగతి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారుల శాఖ, పోలీసు, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు మాదకద్రవ్యాల నివారణకు అధికారులు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్ :

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అధికారులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, కళాశాలల ప్రతినిధులు సమష్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కేవలం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా, మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన సమాచారం సేకరించి, వాటి నివారణకు క్రియాశీలక చర్యలు చేపట్టాలని అన్నారు.గురువారం జిల్లా కలెక్టరేట్‌లో మాదకద్రవ్యాల నివారణపై జిల్లా అధికారులు, కళాశాలల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకితో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు చేపడుతున్న చర్యలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే ప్రభావం, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలు, చట్టపరమైన పరిణామాలపై విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. అన్ని కళాశాలల్లో మాదకద్రవ్యాల నివారణకు సంబంధించిన పోస్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడినట్లు లేదా వాటి విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యంగా వైద్య, ఇంజినీరింగ్, విశ్వవిద్యాలయాలు, ఇతర వృత్తి విద్యా కళాశాలల్లో ప్రవేశ సమయంలో నిర్వహించే పరిచయ కార్యక్రమాల్లోనే మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు సంబంధించిన 24 కేసులు నమోదు చేసి, 32 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించి పోలీసులకు సమాచారం అందించడంలో కళాశాలల యాజమాన్యాలు, ప్రతినిధులు మరింత చొరవ చూపాలని కోరారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నట్లు

తెలిసినా, వాటి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు.కళాశాలల పేరుప్రతిష్ఠలకు భంగం కలగకుండా, సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించేందుకు విద్యాసంస్థల ప్రతినిధులు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అవసరమైతే సంబంధిత విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, వ్యసన విముక్తి కేంద్రాలకు పంపించి చికిత్స, కౌన్సెలింగ్ అందించే చర్యలు చేపడతామని తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, మరికొన్ని కేసుల్లో తదుపరి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.గంజాయితో పాటు వైట్‌నర్, దగ్గు మందుల సిరప్‌లు, ఫెవికాల్ వంటి పదార్థాలను దుర్వినియోగం చేసే అవకాశాలపైనా విద్యాసంస్థలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. కొన్ని పదార్థాల దుర్వినియోగాన్ని సాధారణ మాదకద్రవ్య పరీక్షల ద్వారా గుర్తించడం కష్టమవుతుందని, అందువల్ల విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను అధ్యాపకులు, వార్డెన్లు గమనించాలని అన్నారు. మత్తు పదార్థాల వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.కళాశాలల ప్రతినిధులు మాట్లాడుతూ, ఇప్పటికే తమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరింత విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు పోలీసు, వైద్య, సంబంధిత శాఖల సహకారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని ప్రోత్సహించే వ్యక్తులు, విద్యాసంస్థల పరిసరాల్లో అనుమానాస్పదంగా కార్యకలాపాలు నిర్వహించే దుకాణాలు, ఇతర వనరులపై నిఘా పెట్టాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, కళాశాలల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలకు సంబంధించిన సమాచారం సేకరించి పోలీసులకు అందించాలని సూచించారు. విద్యార్థులు ఎక్కువ సమయం కళాశాలలు, వసతి గృహాల్లో గడుపుతున్నందున అధ్యాపకులు వారి ప్రవర్తనను నిశితంగా గమనించాలని అన్నారు. విద్యార్థులు తమ పిల్లలేననే భావనతో వారిని సరైన మార్గంలో నడిపించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు, పోలీసు, వైద్య, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం నివారణకు అవగాహన కార్యక్రమాలతో పాటు సమస్యలను గుర్తించడం, బాధితులకు తగిన సహాయం అందించడం,

వాటి సరఫరా వనరులను అరికట్టడం వంటి చర్యలకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు.సమావేశంలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ పై. మధుసూదన్ నాయక్, డి.ఆర్.ఓ ఎ. నిర్మల, డి.డబ్ల్యూ.ఓ జరీన బేగం, కళాశాలల ప్రతినిధులు, ప్రిన్సిపాల్ లు, ఎన్. జి. ఓ ప్రతినిధులు, విద్య శాఖ, వైద్య శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి కంటారెడ్డి తిరుపతి రెడ్డి గారు ఆర్థిక సాయం.

అప్పులబాదతో మృతి చెందిన చిమ్మనమైన నాగరాజు కుటుంబానికి రూ.5 వేల సహాయం.

ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

వుదయం ప్రతినిధి నిజాంపేట్ మండలం నార్లపూర్ గ్రామానికి చెందిన చిమ్మనమైన నాగరాజు అప్పులబాధతో మృతి చెందారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు.నాగరాజు మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన కంఠారెడ్డి తిరుపతి రెడ్డి బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా ఆర్థిక సాయం అందజేశారు. ఆయన సూచనల మేరకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5 వేల నగదును అందజేశారు.

అయిజ మార్కెట్ యార్డులో జూదం కలకలం!

పశువుల సంతలో నాణేల ఆటల పేరుతో జూదం.. పట్టించుకునే వారేరీ?

అయిజ అక్టోబర్ 29
వుదయం ప్రతినిధి

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ప్రతి గురువారం నిర్వహించే పశువుల సంతలో జూదం జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంతకు వచ్చే రహదారిపైనే నాణేల ఆటల పేరుతో ఈ వ్యవహారం సాగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. పశువుల కొనుగోలు, అమ్మకాల కోసం వివిధ గ్రామాల నుంచి రైతులు సంతకు వస్తుంటారు. ఈ క్రమంలో రోడ్డుపైనే నాణేల ఆటల పేరుతో జరుగుతున్నట్లు చెబుతున్న జూదం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారుల పర్యవేక్షణ ఏదీ? మార్కెట్ యార్డు పరిసరాల్లో ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. పశువుల సంత జరిగే రోజుల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఆరోపణలపై సమగ్ర

విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయిజ పశువుల సంతలో జూదం జరుగుతోందన్న ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఎస్సీ కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై. నరోత్తం

– (వుదయం ప్రతినిధి అక్టోబర్ 29 న్యాలకల్)

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్ కల్ మండలం రాజోళ గ్రామంలో కొద్దీ రోజుల క్రితం పార్టీ కార్యకర్త అశోక్ భార్య స్వరూప ఆకాల మృతి చెందగా ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై. నరోత్తం గారు ఈ రోజు వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది

ఈ కార్యక్రమంలో గ్రామం సర్పంచ్ వెంకట్ రావు పాటిల్,మాజీ సర్పంచ్ సత్యానారాయణ,వై. తరుణ్,నాయకులు శివకుమార్,చెంగల్ జైపాల్,భీమన్న, బస్వరాజ్,పాండప్ప,మల్లప్ప, సంగు,రమేష్,నందు,అశోక్, మారుతి,రఘు,తదితరులు ఉన్నారు

ఉర్కొండపేట రైతు వేదికలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం

ఊర్కొండ న్యూస్ అక్టోబర్ 29:వుదయం ప్రతినిధి

నాగర్‌కర్నూల్ జిల్లా, ఉర్కొండ మండలం, ఉర్కొండపేట గ్రామంలోని రైతు వేదికలో ఈరోజు ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, నీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నేల ఆరోగ్య పరిరక్షణ తదితర వ్యవసాయ అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది.

ఈ సందర్భంగా వ్యవసాయంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, అధిక నీటి అవసరం కలిగిన వరి పంటకు బదులుగా నీటి లభ్యతను బట్టి కంది, పెసర, మినుము వంటి పప్పుధాన్య పంటలను సాగు చేయాలని రైతులకు సూచించడం జరిగింది. అలాగే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం, సమతుల్య ఎరువుల వినియోగం, పంటల మార్పిడి, సమగ్ర చీడపీడల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ప్రాధాన్యత గురించి వివరించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ఉర్కొండపేట గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పశు వైద్యాధికారి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ రైతులు మరియు మీడియా మిత్రులు హాజరయ్యారు.

రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ, నీటి వనరులను సంరక్షిస్తూ, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని ఈ సందర్భంగా సూచించడం జరిగింది.

వీరన్నపేటను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతాం

మహబూబ్‌నగర్ : రూ. 40 కోట్లతో మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన

వీరన్నపేటలో మరో సమీకృత గురుకుల పాఠశాలరెండేళ్లలోపు అత్యాధునిక భవనాలు, వసతి గృహాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యం - ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కృషితోనే మైనారిటీ పాఠశాలలకు నేడు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని మహబూబ్‌నగర్ ఎంపి లి డికె అరుణ లి అన్నారు. నగరంలోని వీరన్నపేట డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమీపంలో రూ. 40 కోట్ల అంచనా వ్యయంతో రెండు మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలల నిర్మాణానికి ప్రభుత్వ విప్ లి యెన్నం శ్రీనివాస్ రెడ్డి తోలి కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా మహబూబ్‌నగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ మైనారిటీ బాలికల పాఠశాలలను తిరిగి ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి లిరేవంత్ రెడ్డి లి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాను సమకూర్చి, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టును మళ్లీ కార్యరూపంలోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఈ పాఠశాలల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, రెండేళ్లలోపు అత్యాధునిక భవనాలు, వసతి గృహాలతో పాఠశాలలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని ఆయన వెల్లడించారు. ఒక్కో పాఠశాలలో సుమారు 600 మంది చొప్పున మొత్తం 1,200 మంది బాలికలకు నాణ్యమైన విద్య అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. వీరన్నపేటతో పాటు పరిసర ప్రాంతాల్లో నివసించే పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రాంతంలో విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. కూలీలు, రిక్షా, ఆటో డ్రైవర్లు, మెకానిక్‌లు, వ్యవసాయ కూలీలు, దుకాణాల్లో పనిచేసే ఉద్యోగుల కుటుంబాలకు చెందిన పిల్లలు సైతం అత్యుత్తమ సౌకర్యాలతో కూడిన పాఠశాలల్లో చదువుకోవాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యాసంస్థలు ప్రధాన రహదారులపై కనిపించేలా ఏర్పాటు చేయడం కంటే, పేద కుటుంబాలకు చేరువలో ఉండి వారి పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయడం ముఖ్యమని అన్నారు. నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు అందుబాటులోకి వస్తే స్థానిక తల్లిదండ్రుల్లో తమ పిల్లలను ఉన్నత ప్రమాణాలతో కూడిన పాఠశాలల్లో చదివించాలనే నమ్మకం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మైనారిటీ బాలికల కోసం రెండు గురుకుల పాఠశాలలతో పాటు, అన్ని వర్గాల పిల్లలకు విద్యావకాశాలు కల్పించేలా సమీకృత గురుకుల పాఠశాల (ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్) ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ విద్యాసంస్థల నిర్మాణం పూర్తయితే వీరన్నపేట ప్రాంతం విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. విద్య ద్వారా పేద కుటుంబాల పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించడంతో పాటు, ప్రాంత అభివృద్ధికి బలమైన పునాది వేయవచ్చని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వీరన్నపేట మహబూబ్‌నగర్ నగరంలోనే ప్రముఖ విద్యా కేంద్రంగా, అభివృద్ధికి చిరునామాగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయం

గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదును వేగవంతం చేయాలి: డాక్టర్ ఆంజనేయ గౌడ్

గద్వాల, అక్టోబర్ 29

వుదయం కరస్పాండెంట్ పాలమూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి భారీ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ నాయకుడు, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్, గద్వాల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గద్వాల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన గద్వాల పట్టణ గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు సమీక్ష సమావేశానికి డాక్టర్ ఆంజనేయ గౌడ్ హాజరయ్యారు. నియోజకవర్గ ముఖ్య నాయకులు హన్మంతు నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, సూర్య గౌడ్, రాఘవేంద్ర రెడ్డి, పటేల్ జనార్దన్ రెడ్డితో కలిసి ఓటర్ల నమోదు ప్రక్రియ, ఇప్పటివరకు సాధించిన పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై పట్టభద్రుల్లో అసంతృప్తి పెరుగుతోందని విమర్శించారు. విద్యా, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని ఆరోపించారు. పక్క రాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎదుర్కొన్న పరాజయాలను ప్రస్తావిస్తూ, పాలమూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని వ్యాఖ్యానించారు. గద్వాల నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని నాయకులకు సూచించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో సమన్వయంతో పనిచేసి, బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు నరసింహులు, దుబన్న, సంటెన్న, గువ్వల గోపాల్, మోహన్ యాదవ్, చిత్తారి కిరణ్, సాకి డేవిడ్, రామకృష్ణ ముదిరాజ్, పవన్ కుమార్ సాగర్, చక్రిధర్ రెడ్డి, కమ్మరి రాము, మోనేష్ మరోజు, కురువ పల్లయ్య, యూసఫ్, లక్ష్మీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ప్రతాప్, రామకృష్ణ, జాంపల్లి భరత్ సింహారెడ్డి, బాసు గోపాల్, సోమశేఖర్ రెడ్డి, తిమ్మప్ప గౌడ్, డ్యామ్ శ్రీను, ముని, ఆంజనేయులు, రమేష్, నాగరాజు, పరశురాముడు, లక్ష్మణ తదితరులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఇసుక తరలించండి..

- రైతుల పొలాలకు నష్టం చేయొద్దు!
- సాగర్ ప్రాజెక్టు ఇసుక తరలింపుపై
- శెట్టి రమేష్ ఆవేదన

తాండూర్ అక్టోబర్ 29(వుదయం ప్రతినిధి): శివ సాగర్ ప్రాజెక్టు నుంచి అభివృద్ధి పనుల కోసం ఇసుక తరలింపు వ్యవహారంలో రైతుల ప్రయోజనాలను విస్మరించవద్దని రైతు శెట్టి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తాండూర్ డివిజన్ పరిధిలోని యాలాల మండలం శివసాగర్ ప్రాజెక్టు నుండి అభివృద్ధి పనులకు ఇసుక అవసరమేనని, అయితే ఆ పేరుతో తమ వ్యవసాయ భూములకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కోరారు. ఎన్ని లారీలు.. ఎన్ని టన్నుల ఇసుక? అభివృద్ధి పనుల కోసం అసలు ఎంత ఇసుక అవసరం? ఎన్ని లారీల ద్వారా, ఎన్ని టన్నుల ఇసుకను తరలించనున్నారు? అనే అంశాలపై స్పష్టత ఉండాలని శెట్టి రమేష్ ప్రశ్నించారు. ఇసుక తరలింపు ప్రక్రియలో పారదర్శకత పాటించడంతోపాటు, తవ్వకాలు, రవాణా వల్ల రైతుల పొలాలకు నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధికి మేం వ్యతిరేకం కాదు..

ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు జరగాలన్నదే తమ ఆకాంక్ష అని, అయితే రైతుల జీవనాధారమైన వ్యవసాయ భూములకు ఇబ్బందులు ఎదురుకాకూడదని ఆయన స్పష్టం చేశారు. ఇసుక తరలింపునకు సంబంధించి నిబంధనలు పాటిస్తూ, రైతులకు నష్టం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులు, రైతుల ప్రయోజనాలు రెండింటినీ సమన్వయం చేస్తూ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని శెట్టి రమేష్ కోరారు.

ధైర్యంగా మాట్లాడడమే రక్షణకు మొదటి మెట్టు
జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్ కుమార్

నారాయణపేట టౌన్ అక్టోబర్ 29(వుదయం ప్రతినిధి) మౌనంగా ఉండడం కంటే ధైర్యంగా మాట్లాడడమే రక్షణకు మొదటి మెట్టు అని జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్ కుమార్ అన్నారు. సురక్షిత్ బచ్‌పన్ అభియాన్ లో భాగంగా నాల్గవ రోజు బోలో, బతావో, బచావో అంశంపై ప్రభుత్వ జెడ్‌పీహెచ్‌ఎస్, జాజాపూర్ లో గురువారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మాట చెప్పడం వల్ల ఒక బాల్యం రక్షించబడుతుంది. భయంతో మౌనంగా ఉండటం కాదు, ధైర్యంగా మాట్లాడటమే రక్షణకు మొదటి మెట్టు అని అన్నారు. మంచి స్పర్శ, చెడు స్పర్శ అంటే ఏమిటో గుర్తించాలని మీకు నచ్చని స్పర్శ జరిగినా, ఎవరైనా భయపెట్టినా, అసభ్యంగా మాట్లాడినా వెంటనే బోలో అనాలని అన్నారు. ఆ తర్వాత మీ అమ్మకు, నాన్నకు, టీచర్ కి, లేక చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి బతావో అన్నారు. అలా చెబితేనే మనం మిమ్మల్ని బచావో చేయగలుగుతామని తెలిపారు.

జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ మహిళా భద్రత చైతన్యం, మహిళల రక్షణ కేవలం ప్రభుత్వం లేదా పోలీసుల బాధ్యత మాత్రమే కాదన్నారు. ప్రతి ఇల్లు, ప్రతి వ్యక్తి ఈ విషయంలో భాగస్వాములు కావాలన్నారు. ఇంట్లో ఉండే ఆడపిల్లలకు ధైర్యాన్ని ఇవ్వాలి, మగపిల్లలకు తోటివారిని గౌరవించడం నేర్పించాలన్నారు. అప్పుడే ఈ బోలో, బతావో, బచావో అనే నినాదం నిజమైన విజయాన్ని అందుకుంటుంది అన్నారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె. లక్ష్మిపతి గౌడ్ మాట్లాడుతూ డి ఎల్ ఎస్ ఏ పాత్ర ఉపయోగాలను వివరించారు. డి ఎల్ ఎస్ ఏ ఉపయోగాలు టోల్ ఫ్రీ నోబర్స్ గురించి వివరించారు. తెలుసుకున్న చట్టాలను ఇంటికి వెళ్లి మీ తల్లిదండ్రులకు, తోటి స్నేహితులకు తప్పక చెప్పండి అని తెలిపారు.

నేను భయపడను... నేను చెప్తాను.. నా స్నేహితులని కాపాడుతాను... బోలో, బతావో, బచావో... నేను భయపడను. నేను మాట్లాడతాను, నేను నా స్నేహితులను రక్షిస్తాను అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ డిపార్ట్మెంట్ సంగీత, చైల్డ్ డిపార్ట్మెంట్ కరిష్మా, నర్సిములు, భరోసా,సఖి సెంటర్ ప్రమీల, అశ్విని, కవిత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు విజయ, నిర్మల, లక్ష్మణ్, శశిరేఖ ,నరసింహ ,రఘురాం రెడ్డి, భాను ప్రకాష్ ,ప్యానల్ న్యాయవాదులు కాంత్ కుమార్, పార లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం .

వుదయం ప్రతినిధి నిజాంపేట్ మండలం నార్లపూర్ గ్రామానికి చెందిన కాశమైన నర్సింలు అప్పులబాధతో మృతి చెందారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. నర్సింలు మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన కంఠారెడ్డి తిరుపతి రెడ్డి బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా ఆర్థిక సాయం అందజేశారు. ఆయన సూచనల మేరకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 5 వేల నగదును అందజేశారు.

పొగాకు వినియోగంతో ప్రాణాంతక వ్యాధులు..
విద్యార్థులకు వైద్యుల అవగాహన

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి
-- గట్టు కేజీబీవీలో అవగాహన సదస్సు

గట్టు అక్టోబర్ 29

వుదయం కరస్పాండెంట్

పొగాకు వినియోగం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించారు. విద్యార్థి దశ నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సంధ్యా కిరణ్మయి ఆదేశాల మేరకు, సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రదీప్ కుమార్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని కేజీబీవీ పాఠశాలలో పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సిగరెట్లు, బీడీలు, గుట్కా తదితర పొగాకు ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. స్నేహితుల ఒత్తిడికి లేదా ఇతరుల ప్రభావానికి లోనై పొగాకు వ్యసనాలకు బానిసలు కావద్దని విద్యార్థులకు సూచించారు.

పొగాకు రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

పొగాకు వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ ఆర్థిక పరిస్థితులపై, సమాజ ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని వైద్యులు తెలిపారు. పొగాకు ఉత్పత్తులకు పూర్తిగా దూరంగా ఉంటూ, వాటి వల్ల కలిగే నష్టాలను కుటుంబ సభ్యులకు, స్నేహితులకు వివరించాలని కోరారు.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, పోషకాహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. పొగాకు వినియోగానికి దూరంగా ఉంటామని, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తామని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి డెమో హీర్యానాయక్, జిల్లా ఎన్‌సీడీ కో-ఆర్డినేటర్ వెంకటేష్, హెల్త్ అసిస్టెంట్ వెంకటాద్రి నాయుడు, పాఠశాల అధ్యాపకులు, వైద్య సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

సీసీఐ కేంద్రాల్లో క్వింటాల్‌కు రూ. 8,667 మద్దతు ధర..

కపాస్ కిసాన్ యాప్‌తో స్లాట్ బుకింగ్

గద్వాల, అక్టోబర్ 29వుదయం బ్యూరో పత్తి రైతులకు న్యాయమైన ధర లభించేలా, కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. రైతులు పత్తిని ఇతర జిల్లాలకు తరలించకుండా స్థానికంగానే విక్రయించుకునే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురువారం గద్వాలలో భారత పత్తి సంస్థ (సీసీఐ) ఆధ్వర్యంలో హరిత, బాలాజీ పత్తి మిల్లుల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పత్తి కొనుగోళ్ల ప్రక్రియ, మార్కెట్ ధరలు, ప్రైవేటు వ్యాపారులు అందిస్తున్న ధరలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను, మిల్లుల యజమానులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పత్తిని విక్రయించేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లడం వల్ల రైతులకు రవాణా ఖర్చులు పెరిగి ఆర్థిక భారం పడే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోనే సరైన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని, కొనుగోళ్లలో పారదర్శకత పాటిస్తూ తూకం, ధర నిర్ణయం, చెల్లింపుల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.

క్వింటాల్‌కు రూ. 8,667 ధర

సీసీఐ ద్వారా పత్తికి క్వింటాల్‌కు రూ. 8,667 ధర లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయించాలనుకునే రైతులు తమ మొబైల్ ఫోన్లలో కపాస్ కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. స్థానికంగా కొనుగోళ్లు పెరగడం ద్వారా రైతులకు రవాణా ఖర్చులు తగ్గడంతోపాటు జిల్లాలో వ్యవసాయ ఆధారిత వ్యాపార కార్యకలాపాలకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. జిన్నింగ్ ప్రక్రియ పరిశీలనఅనంతరం మిల్లుల్లో పత్తి నుంచి విత్తనాలను వేరు చేసే జిన్నింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. వెయ్‌బ్రిడ్జి విభాగం పనితీరును పర్యవేక్షించి, జిన్నింగ్, ప్రెస్సింగ్ యంత్రాల పనితీరును గమనించారు. పత్తి బేళ్లను పరిశీలించి, విత్తనాలను వేరు చేయడం, వాటిని ఆయిల్ మిల్లులకు సరఫరా చేయడం, మిల్లుల ఉత్పత్తి సామర్థ్యం తదితర అంశాలపై నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం, ఎల్‌నినో ప్రభావంతో సాగుపై పడిన ప్రభావం, పత్తి ఉత్పత్తిలో వచ్చిన మార్పులపై చర్చించారు. అందుబాటులో ఉన్న పత్తి ప్రాసెసింగ్ సదుపాయాలను సమర్థంగా వినియోగించుకుంటూ రైతులకు స్థానికంగానే మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలని సంబంధిత అధికారులు, మిల్లుల నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా మార్కెటింగ్ అధికారిణి పుష్పమ్మ, గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎల్లస్వామి, సీసీఐ ప్రతినిధి రాహుల్, మిల్లుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ గుడి నిర్మాణానికి 1,50 116 విరాళం అందజేత

సర్పంచ్ కేశ మల్ల అనూష కృష్ణ

వెల్దండ అక్టోబర్ 29 (వు దయం) మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో నిర్మాణం చేపడుతున్న పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ కేశ మల్ల అనూష కృష్ణ 1,50,116 /-(ఒక లక్ష యాభై వేల నూట పదహారు రూపాయలు) ప్రకటించారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు కృష్ణ కు శాలువాలు కప్పి అభినందించారు కార్యక్రమంలో అధ్యక్షులు కాగుల సాయి, ఉపాధ్యక్షులు శివ యాదవ్, వార్డు సభ్యులు తిరుపతి నాయక్, మల్లేష్ యాదవ్ తదితరులు ఉన్నారు

అంగన్ వాడి కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్

నారాయణపేట అక్టోబర్ 29(వుదయం ప్రతినిధి) జాజాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సంక్షేమ సేవలు, ప్రభుత్వ పథకాల అమలు తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లను చిన్నారుల ఆరోగ్య పరిస్థితులు, వారి బరువు, ఎదుగుదల, ప్రతిరోజూ అందిస్తున్న పోషకాహారం, గుడ్లు, పాలు పంపిణీ, ప్రభుత్వం నిర్దేశించిన రోజువారీ మెనూ అమలు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం, ఇతర సంక్షేమ ప్రయోజనాల పంపిణీ తీరును సమీక్షించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులతో ముచ్చటించి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, సమతుల్య పోషకాహారాన్ని తప్పనిసరిగా అందించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. పోషకాహార పంపిణీలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న పోషకాహార నిల్వలను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి, సరుకుల నిల్వలు, పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, సంపూర్ణ ఎదుగుదల, పోషకాహార లోపాల నివారణలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు అర్హులందరికీ సక్రమంగా అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ, పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు.

రైతులు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

క్వింటాల్ పత్తికి రూ. 8,667 మద్దతు ధర

గద్వాల, అక్టోబర్ 29

వుదయం కరస్పాండెంట్ జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో మూడు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో రైతులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గద్వాల పట్టణంలోని హరిత, బాలాజీ పత్తి మిల్లులతోపాటు ఆలంపూర్ చౌరస్తా సమీపంలోని వరసిద్ధి వినాయక మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రైతులు ముందుగా తమ మొబైల్ ఫోన్లలో కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా లాగిన్ కావాలని సూచించారు. అనంతరం యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుని, నిర్దేశిత తేదీన తమ పత్తిని సమీపంలోని సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అధికారులు పత్తి తేమ శాతాన్ని పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంటను కొనుగోలు చేస్తారని కలెక్టర్ వివరించారు.

ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 8,667గా ఉందని తెలిపారు. జిల్లాలోని పత్తి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, ప్రభుత్వ మద్దతు ధరకు పత్తిని విక్రయించుకోవాలని కలెక్టర్ కోరారు.

తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో ఉద్యాన పంటల సంరక్షణపై రైతులకు అవగాహన

నీటి పొదుపు, డ్రిప్ ఇరిగేషన్‌తో పంటలకు సమర్థవంతంగా నీటి సరఫరా
మల్చింగ్ విధానాన్ని ప్రోత్సహించేందుకు ఎకరానికి రూ.8,000 సబ్సిడీ

సంగారెడ్డి, అక్టోబర్ 29:--వుదయం
తక్కువ వర్షపాతం నమోదవుతున్న ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఉద్యాన పంటలను సంరక్షించుకోవడం, నీరు మరియు ఎరువులను సమర్థవంతంగా వినియోగించుకోవడంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కోహిర్ మండలం వెంకటాపూర్ రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు.
ముఖ్యంగా ఆయిల్ పామ్, ఆలు పంటలు సాగు చేస్తున్న రైతులకు పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.
ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వరరావు మాట్లాడుతూ, తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ, పంటలకు అవసరమైన నీటిని సకాలంలో అందించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూక్ష్మ సేద్య పథకాలను సద్వినియోగం చేసుకొని, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.
పంటల సాగులో మల్చింగ్ విధానాన్ని అవలంబించడం ద్వారా నేలలో తేమను కాపాడుకోవడంతో పాటు పంటల పెరుగుదలకు అనుకూల పరిస్థితులు కల్పించవచ్చని వివరించారు. మల్చింగ్ విధానాన్ని ప్రోత్సహించేందుకు అర్హులైన రైతులకు ఎకరానికి రూ.8,000 చొప్పున సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా కూరగాయల నారును సబ్సిడీపై అందిస్తున్నట్లు పేర్కొన్నారు.
జహీరాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు వైద్యనాథ్ మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నీటి యాజమాన్యంతో పాటు ఎరువుల యాజమాన్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉద్యాన శాఖ అధికారులు సూచించే పంటల వారీ సలహాలను పాటిస్తూ, పంట అవసరాలకు అనుగుణంగా నీరు, ఎరువులను వినియోగించుకోవాలని, తక్కువ వర్షపాతం కారణంగా పంటలకు నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ డివిజన్ ఉద్యాన శాఖ అధికారులు పండరి, కోహిర్ ఉద్యాన శాఖ అధికారి సునీత, వ్యవసాయ అధికారి నవీన్, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్, జహీరాబాద్ ఉద్యాన విస్తరణ అధికారులు విట్టల్, రవీందర్, శైలజ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు, ఇతర సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పంట నష్టాల నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఆలంపూర్ డివిజన్‌లో పంటల క్షేత్రస్థాయి పరిశీలన.. రైతులకు శాస్త్రవేత్తల సూచనలు

ఆలంపూర్, అక్టోబర్ 29వుదయం కరస్పాండెంట్
పంటల్లో చీడపీడలను ప్రారంభ దశలోనే గుర్తించి, శాస్త్రీయ పద్ధతుల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకొని మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ పి. అర్చన సూచించారు. ఆలంపూర్ డివిజన్ పరిధిలోని భుక్కాపురం, జోగులాంబ, ఆలంపూర్ గ్రామాల్లో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెం శాస్త్రవేత్తలు పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వివిధ పంటల్లో కనిపిస్తున్న చీడపీడలు, పోషక లోపాలను గుర్తించి వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మిరపలో పోషక లోపాల గుర్తింపుమిరప పంటలో బోరాన్, మెగ్నీషియం లోపాలను గుర్తించిన శాస్త్రవేత్తలు, వాటి నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. లీటరు నీటికి ఒక గ్రాము బోరాన్, 4--5 గ్రాముల మెగ్నీషియం కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అనంతరం నాలుగు రోజుల వ్యవధితో అగ్రోమిన్ మ్యాక్స్, మరో నాలుగు రోజుల తర్వాత ఫార్ములా-7 పిచికారీ చేయాలని సూచించారు. పత్తి, మినుములో చీడపీడలపై అప్రమత్తతపత్తి పంటలో గులాబీ రంగు కాయతొలుచు పురుగు ఉనికిని గుర్తించారు. రెండో ఏర పూర్తయిన తర్వాత పంటను కొనసాగించడం ఆర్థికంగా లాభదాయకం కాని పరిస్థితుల్లో పంటను తొలగించి, పత్తి అవశేషాలను సక్రమంగా తొలగించాలని సూచించారు. సుమారు 50 రోజుల వయస్సున్న మినుము పంటలో పసుపు రంగు మొజాయిక్ వైరస్, మారుకా పురుగు లక్షణాలను గుర్తించారు. వైరస్ వ్యాప్తిని తగ్గించేందుకు రసం పీల్చే పురుగులను నియంత్రించాలని, మారుకా పురుగు నివారణకు ఎకరానికి 80 మి.లీ. యాంప్లిగో వినియోగించాలని సూచించారు. శనగ, మొక్కజొన్న పంటల్లో ప్రత్యేక చర్యలు
సుమారు 30 రోజుల వయస్సున్న శనగ పంటలో బీట్ ఆర్మీవార్మ్ పురుగు ఉనికిని గుర్తించారు. పురుగు గుడ్ల సమూహాలు, చిన్న లార్వాలను సేకరించి నాశనం చేయాలని, అవసరమైనప్పుడు సిఫారసు చేసిన జీవ నియంత్రణ పద్ధతులు, పురుగుమందులను వినియోగించాలని తెలిపారు. మొక్కజొన్నలో ఫాల్ ఆర్మీవార్మ్ పురుగు తీవ్రంగా ఆశించిన నేపథ్యంలో రైతులు పంటను తరచూ పరిశీలించాలని, గుడ్ల సమూహాలు, చిన్న లార్వాలను తొలగిస్తూ అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పొగాకు పంటపై నిరంతర పర్యవేక్షణ
సుమారు రెండు నెలల వయస్సున్న పొగాకు పంట ఆరోగ్యంగా ఉందని గుర్తించిన శాస్త్రవేత్తలు, ప్రస్తుతం పురుగుమందుల పిచికారీ అవసరం లేదని తెలిపారు. పంటను నిరంతరం పరిశీలిస్తూ, చీడపీడల లక్షణాలు కనిపించినప్పుడు మాత్రమే తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.
రైతులు పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ, శాస్త్రవేత్తలు సూచించిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో పాలెం శాస్త్రవేత్తలు ఏ. శ్రీరామ్, కె. మమత, జి. మాధురి, డాక్టర్ ఎం. శంకర్, ఆలంపూర్ డివిజన్ వ్యవసాయ అధికారి నాగార్జున, రైతులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ విగ్రహం ధ్వంసానికి యత్నం

బీఆర్ఎస్ నేతలపై గాడిపల్లి రఘువర్ధన్ రెడ్డి ఆరోపణలు
కాంగ్రెస్ ఎదుగుదలను ఓర్వలేకే విధ్వంసకర రాజకీయాలు

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 29, వుదయం: సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు కొందరు ప్రయత్నించారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గాడిపల్లి రఘువర్ధన్ రెడ్డి ఆరోపించారు. విగ్రహ ప్రతిష్ఠాపన కోసం సిద్ధంగా ఉంచిన విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించడంతో పాటు, ఇప్పటికే నిర్మించిన గద్దెను సైతం ధ్వంసం చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దుబ్బాకలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలను, ప్రశాంత వాతావరణాన్ని ఓర్వలేక కొందరు బీఆర్ఎస్ నాయకులు భయంతో ఇలాంటి విధ్వంసకర రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విగ్రహాలను ధ్వంసం చేయడం బీఆర్ఎస్ పార్టీకే అలవాటని విమర్శించిన రఘువర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కట్టుబడి ఉందన్నారు. ప్రజల మధ్య శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిని గుర్తించి, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎల్‌నినో ప్రభావం తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి విజ్ఞప్తి

అక్టోబర్ 29
మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర (వుదయం) ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో దేవరకద్ర నియోజకవర్గ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి కోరారు.
ఈ మేరకు హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు.
నియోజకవర్గంలోని గ్రామాల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని, అవసరమైన చర్యలు తీసుకునేలా జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. తాగునీటి సరఫరాకు అవసరమైన నిధులు పెద్ద ఎత్తున కేటాయించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలి

అదనపు కలెక్టర్ పాండు
ఘనంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహణ

సంగారెడ్డి, అక్టోబర్ 29: -వుదయం
యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకొని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ పాండు అన్నారు. జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియం లో జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఘనంగా ఉత్సాహ భరితంగా జరిగాయి . ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ ఉత్సవాల్లో సుమారు 400 మంది యువ కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, స్వామి వివేకానందుడు యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తిని పెంపొందించేందుకు చేసిన బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. వివేకానందుడు 1893లో అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మతాల పార్లమెంటులో అమెరికా సోదరీమణులారా, సోదరులారా అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని తెలిపారు. యువత తమలోని ప్రతిభను వెలికితీసి, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు కళలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలన్నారు. యువజనోత్సవాలు యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చక్కని వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. స్వామి వివేకానందుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని, సమాజ సేవతో పాటు దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో భాగంగా జానపద నృత్యం, జానపద గేయం, వీధి నాటకం, తదితర కళాంశాల్లో పోటీలు నిర్వహించారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు తమ ప్రతిభను ప్రదర్శించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు, అక్కడ ప్రథమ స్థానం పొందిన వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని అధికారులు తెలిపారు. వచ్చే జనవరిలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు యువత తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి సంబంధిత అధికారులు, యువ కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల పరిహార పోరాటానికి బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు

4వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష
సంఘీభావం తెలిపిన బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డీ

యాలాల,అక్టోబర్ 29 వుదయం ప్రతినిధి:- యాలాల మండల కేంద్రంలో దౌలపూర్ రెవిన్యూ గ్రామానికి చెందిన రైతులు తమ భూములకు రావలసిన నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన దీక్ష గురువారంతో 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా భారత రాష్ట్ర సమితి (బి ఆర్ ఎస్) యాలాల మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి దీక్షాశిబిరాన్ని సందర్శించి రైతులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.
ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ భూములను ఇచ్చి నష్టపోయిన దౌలపూర్ రెవిన్యూ గ్రామరైతులు గత నాలుగు రోజులుగా శాంతియుతంగా దీక్షలు చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు .భూములు కోల్పోయిన ప్రతి రైతుకూ న్యాయమైన నష్టపరిహారం అందే వరకు బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని తెలిపారు అలాగే,సంబంధిత రెవిన్యూ మరియు ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి,బాధిత రైతులతో చర్చలు జరిపి తక్షణమే పరిహారం మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మహేందర్ బిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ముఖ్య నాయకులు,లాలప్ప,చిట్టి పటేల్,పటేల్ రెడ్డి,శ్రీనివాస్ యాదవ్ తదితరులు కార్యకర్తలు మరియు దౌలపూర్ గ్రామ బాధిత రైతులు వెంకటయ్య, అంజిలమ్మ,బాల్ రాజ్, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏదిరెపల్లిలో వెలుగులు నింపిన హైమాక్స్ లైట్లు - ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

తిమ్మాజిపేట, అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి) : నాగర్ కర్నూల్ నియోజకవర్గంలోని తిమ్మాజిపేట మండలం ఏదిరెపల్లి గ్రామానికి నూతన వెలుగులు వచ్చాయి. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాక్స్ విద్యుత్ స్తంభాలను నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని, రాత్రివేళల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, భద్రతా పరంగా హైమాక్స్ లైట్లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వివేక్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి,
గ్రామ సర్పంచ్ రాజు, ఉప సర్పంచ్ గోపాల్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి దౌలాపూర్ వద్ద శవం లభ్యం

యాలాల అక్టోబర్ 29 వుదయం ప్రతినిధి:- మతిస్థిమితం లేని ఓ వ్యక్తి మూర్ఛ వ్యాధితో మృతి చెందినట్లు యాలాల ఎస్సై విటల్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్య రాము గౌడ్ 47 కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండడంతో ఈనెల 26న రాము గౌడ్ కుటుంబ సభ్యులు, భార్య సూర్య జ్యోతి గౌడ్ చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం ఈనెల 26న చేర్పించారు. మూర్ఛ వ్యాధి తో బాధపడుతూ మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఆస్పత్రి నుండి ఎవరికి చెప్పకుండా వెళ్ళిపోయాడని తెలిపారు. ఆసుపత్రి నుండి వెళ్లిపోయిన వ్యక్తి ఆచూకీ లేదనితాండూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారని తెలిపారు. యాలాల మండలం దౌలాపూర్ గ్రామ సమీపంలో బుధవారం రాత్రి మృతి చెందినట్లు భార్య ఫిర్యాదు చేశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విట్టల్ రెడ్డి తెలిపారు

మైనర్ల చేతిలో వాహనాలు

- ట్రాఫిక్ నిబంధనలు గాలికి - అచ్చంపేటలో యథేచ్ఛగా సాగుతున్న మైనర్ డ్రైవింగ్

అచ్చంపేట, అక్టోబర్ 29:(వుదయం ప్రతినిధి)అచ్చంపేట పట్టణ ప్రధాన రహదారిపై మైనర్లు ఇష్టారాజ్యంగా ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నారు. ట్రాఫిక్ పోలీసుల నిఘా లేకపోవడంతో చిన్నారులు స్కూటీలపై రయ్ రయ్ మంటూ తిరుగుతున్న దృశ్యం ఈ ఫోటోలో స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణంలోని సబ్ కలెక్టర్,తహసీల్దార్ కార్యాలయాల ఎదురుగా అపోలో ఫార్మసీ, =ఖ టెక్నో నుండి రోడ్డు క్రాస్ చేస్తూ ఇద్దరు బాలురు హెల్మెట్ లేకుండా, నంబర్ ప్లేట్ కూడా సరిగ్గా లేని స్కూటీపై ప్రధాన రహదారిపై వేగంగా వెళుతున్నారు. వారికి డ్రైవింగ్ లైసెన్స్ లేదు, కనీసం కాళ్లు కూడా నేలకు అందని పరిస్థితి. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇచ్చి చేజేతులా ప్రమాదాలకు కారణమవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇలాంటి మైనర్ డ్రైవింగ్ పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానాలు విధించాలని ప్రజలు కోరుతున్నారు. పోలీసు శాఖ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మైనర్ డ్రైవింగ్ ను అరికట్టాలని, లేనిపక్షంలో పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సామాజిక వేత్తలు హెచ్చరిస్తున్నారు.

దేవరకద్రలో నూతన బస్ డిపో ఏర్పాటు చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి విజ్ఞప్తి

అక్టోబర్ 29
మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర (వుదయం)రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి కలిసి దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో నూతన బస్ డిపో ఏర్పాటు చేయాలని కోరారు.
నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు, వివిధ ప్రాంతాలకు బస్సుల రాకపోకలను సులభతరం చేసేందుకు దేవరకద్రలో బస్ డిపో ఏర్పాటు అవసరమని వివరించారు. బస్ డిపో అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగడంతో పాటు ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి చేసిన విజ్ఞప్తిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య పరిష్కారానికి, మెరుగైన రవాణా సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే చేస్తున్న ప్రయత్నాలు దేవరకద్ర అభివృద్ధిపై ఆయనకున్న ప్రత్యేక శ్రద్ధను ప్రతిబింబిస్తున్నాయి.

దేశం కోసం యువత నడుం బిగించాలి

ఎంపీ శ్రీమతి డీకే అరుణ

మహబూబ్‌నగర్ : జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ లైబ్రరీ ఆడిటోరియంలో మేరా యువ భారత్ మహబూబ్‌నగర్, ఉద్భవ్ సేవా సంసద్ ఆధ్వర్యంలో "యువ సంసాద్" కార్యక్రమం విజయవంతంగా జరిగింది. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలనే ఉద్దేశంతో 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' నినాదంతో పాటు 'ఎస్ఐఆర్'పై యువతకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశం కోసం యువత నడుం బిగించాలని, ఉన్నత చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. మత్తుకు బానిసై తమ అమూల్యమైన జీవితాలను చిత్తు చేసుకోవద్దని హితవు పలికారు. చాలా మంది 'ఎస్ఐఆర్' అంశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని,

దీనిద్వారా అర్హులైన వాస్తవికులకు ఓటు హక్కు లభించి దేశ అభివృద్ధికి తోడ్పడుతుందని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ అనేది ఏ ఒక్క రాజకీయ పార్టీ కోసం కాదని, కేవలం దేశ భద్రత కోసం మాత్రమే పనిచేస్తుందని అవగాహన కల్పించారు.

ఈ అవగాహన సదస్సులో పాలమూరు యూనివర్సిటీ వీసీ వీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్ బాబు, డీన్ మధుసూదన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ సెల్ అధికారి డాక్టర్ ప్రవీణా పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా యువజన అధికారి కోటా నాయక్, జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్, ఉద్భవ్ సేవా సంసద్ అధ్యక్షులు కిరణ్ కుమార్ రెడ్డి, ప్రొఫెసర్ అర్జున్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

సేవా కార్యక్రమాల్లో వాసవి క్లబ్ ముందుంటుంది

– వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ రీజినల్ చైర్ పర్సన్ పోలా చంద్రమౌళి

బిజినపల్లి, అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి) : సేవా కార్యక్రమాల్లో వాసవి క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ రీజినల్ చైర్ పర్సన్ పోలా చంద్రమౌళి అన్నారు.

మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఆయన అధికారిక పర్యటన సందర్భంగా బుధవారం వాసవి క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పాఠశాలకు వాటర్ ట్యాంక్, విద్యార్థులకు అట్లాస్ లు, పుస్తకాలను పంపిణీ చేశారు. సైన్స్ మ్యాగజైన్ వార్షిక చందా మొత్తాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నకు సోమిశెట్టి ప్రేమ్ కుమార్ అందజేశారు. అంతేకాకుండా తల్లిదండ్రులు లేని ఇద్దరు బాలికలకు ఒక్కొక్కరికి రూ.2000 చొప్పున మొత్తం రూ.4000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పేద విద్యార్థులకు భవిష్యత్తులోనూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు సంబు శ్రీనివాసులు, వనిత క్లబ్ అధ్యక్షురాలు సంబు అపర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందిస్తోంది

స్మార్ట్ రేషన్ కార్డులతో పేదలకు మరింత భరోసా

-- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

మిడ్జిల్, అక్టోబర్ 29, వుదయం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను నేడు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి గారు మిడ్జిల్ మండలంలోని మల్లాపూర్, కొత్తూర్, వెలుగొమ్ముల, అయ్యవారిపల్లి, చిల్వేర్ గ్రామాల లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించేందుకు కృషి చేస్తోందని, స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

కోహీర్ మండలంలో బీఎల్ఎంసీపీల పనితీరు అంతంతమాత్రమే!

80 శాతం కంటే తక్కువ పురోగతిపై అసంతృప్తి

సంబంధిత సిబ్బందికి మెమోలు జారీ చేసినట్లు సమాచారం

కోహీర్, అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి):కోహీర్ మండలంలో బీఎల్ఎంసీపీల పనితీరు ఆశించిన స్థాయిలో లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు జరగకపోవడం, పనితీరు 80 శాతం కంటే తక్కువగా ఉండటంపై సంబంధిత అధికారులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బాధ్యులైన సిబ్బందికి మెమోలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

మండల పరిధిలో గ్రామస్థాయిలో స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన కార్యకలాపాలు, సంఘాల పనుల పురోగతి, సీసీలు, వీఓఏల ద్వారా నిర్వహించే కార్యక్రమాలపై అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. నిర్ణయించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాల్సి ఉండగా, ఆశించిన పురోగతి సాధించకపోవడంపై అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

అయితే, పనితీరు 80 శాతం కంటే తక్కువగా ఉన్న యూనిట్లు ఎన్ని? ఎంతమంది సిబ్బందికి మెమోలు జారీ చేశారు? పనితీరు మెరుగుపడకపోతే ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు? అనే వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి పూర్తి వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం.

- **. ఏడుగురు క్షేత్ర సహాయకులపై సస్పెన్షన్ వేటు!**
- **కరువు పరిస్థితుల్లో కూలీలకు 100 శాతం ఉపాధి కల్పించాలి**
- **125 రోజుల పని దినాలతో రూ.30 వేలకు పైగా ఆదాయం పొందే అవకాశం**
- **అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

గద్వాల, అక్టోబర్ 29వుదయం బ్యూరో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, గ్రామీణ కూలీలకు సొంత గ్రామాల్లోనే ఉపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనుల అమలులో నిర్లక్ష్యం వహించిన వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురు క్షేత్ర సహాయకులను సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

గురువారం సాయంత్రం ఐడీఓసీ సమావేశ మందిరంలో వి.బి.–జి. రామ్ జీ పథకం కింద జిల్లావ్యాప్తంగా చేపట్టిన ఉపాధి హామీ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన కూలీలకు పెద్దఎత్తున జాబ్ కార్డులు అందించి, గ్రామాల్లో గుర్తించిన పనులను

వేగవంతంగా చేపట్టాలని సూచించారు.

కూలీలకు 125 రోజుల పని కల్పించాలి

అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే కూలీలకు 125 రోజుల వరకు ఉపాధి కల్పించి, రూ.30 వేలకు పైగా ఆదాయం పొందే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాల్లో ఉపాధి పనులు అందుబాటులో ఉన్నప్పటికీ కూలీలు వలస వెళ్లే పరిస్థితులు ఏర్పడితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జలసిరి పనులు పూర్తి చేయాలి

జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పంట కుంటలు, ఇంకుడు గుంతలు, రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ తదితర పనులను వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. జూరాల ప్రధాన కుడి కాలువతో పాటు ఆర్డీఎస్ కాలువల పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ కాలువలు, ఫీడర్ ఛానళ్లలో పూడిక, పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపట్టాలని సూచించారు.

వ్యవసాయ భూములకు రహదారులు లేని గ్రామాలను గుర్తించి, అవసరమైన చోట్ల రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రతి గ్రామపంచాయతీలో కనీసం రూ.కోటి విలువైన పనులు చేపట్టే అవకాశం ఉందని వివరించారు. ఈ పథకం కింద సుమారు 375 రకాల పనులు చేపట్టవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ ముషాహిదా బేగం, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగేంద్రం, పలువురు జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

లాస్య మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

- బాధిత కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

- మూడు గంటల పాటు మార్చురీ ఎదుట ఆందోళన

- న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ

వుదయం, సిద్దిపేట ప్రతినిధి

తొగుట మండలం గుడికందుల గ్రామానికి చెందిన దళిత విద్యార్థిని దావులగళ్ల లాస్య అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థిని మృతికి గల కారణాలను నిష్పక్షపాతంగా వెలికితీసి, ఘటనకు బాధ్యులైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో లాస్య మృతదేహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, ఆమె తల్లిదండ్రులు యాదమ్మ, సంతోష్‌లను పరామర్శించి ఓదార్చారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి సుమారు మూడు గంటల పాటు మార్చురీ ఎదుట ఆందోళన చేపట్టారు. విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరిపించి, కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాత్రి 10 గంటల వరకు బాగానే ఉన్న విద్యార్థిని తెల్లవారుజామున 5 గంటలకల్లా మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను పూర్తిస్థాయిలో వెలుగులోకి తీసుకురావాలని, ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. నిరుపేద విద్యార్థుల భవిష్యత్తుకు సంక్షేమ గురుకులాలు ఎంతో కీలకమని, అలాంటి విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, కనీస వసతులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లలో సమగ్ర తనిఖీలు నిర్వహించి తాగునీరు, మరుగుదొడ్లు, లైటింగ్, ప్రహరీ గోడలు, నాణ్యమైన భోజనం వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్‌కు వినతిపత్రం

విద్యార్థిని లాస్య మృతిపై సమగ్ర విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ హేమావతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక పరిహారం అందించడంతో పాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఘటనలో నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ హేమావతి స్పందిస్తూ, ఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఇన్‌చార్జి మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. లాస్య మృతిపై సమగ్ర విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావుండకూడదని, లాస్య మృతి ఘటనపై వాస్తవాలను వెలికితీసి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

నవాబుపేటను కరువు మండలంగా ప్రకటించాలి

టీఆర్ఎస్ శ్రేణులు భారీ ధర్నా.. తహసీల్దార్‌కు వినతిపత్రం

నవాబుపేట: అక్టోబర్ 29, వుదయం మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాడెమోని నర్సింలు ఆధ్వర్యంలో గురువారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని రైతులు పంట నష్టాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని వారు పేర్కొన్నారు. కరువు పరిస్థితులను గుర్తించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నవాబుపేటను కరువు మండలంగా ప్రకటించి, అర్హులైన రైతులకు కరువు సహాయక చర్యలు అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నాయిరా చందర్ నాయక్, మాజీ జెడ్పీటిసి రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ రంజిత్ కుమార్, బాలరాజు గౌడ్ కార్యకర్తలు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

రాహుల్ సభకు సంగారెడ్డి నుంచి ఢిల్లీ బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కార్యకర్తల బస్సులను జెండా ఊపి ప్రారంభించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి వుదయం నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో జరిగే రాహుల్ గాంధీ బహిరంగ సభకు హాజరయ్యేందుకు సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో బయలుదేరారు. సంగారెడ్డి ఐబీ వద్ద అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంటకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. సదాశివపేట మండలం నుంచి సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సిద్దన్న, శ్రీనివాస్ యాదవ్‌లతో కలిపి మొత్తం 46 మంది బయలుదేరారు. కొండాపూర్ మండలం నుంచి ఆత్మ చైర్మన్ ప్రభు, నాయకులు నర్సింహారెడ్డి, మల్లారెడ్డిలతో కలిపి 26 మంది ఢిల్లీ పయనమయ్యారు. నిర్మల జగ్గారెడ్డి, భరత్ సాయిరెడ్డిలతో సహా సంగారెడ్డి నియోజకవర్గం నుంచి మొత్తం 150 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ సభకు హాజరుకానున్నారు. బస్సుల ప్రారంభ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, బబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లిలో పాంచజన్య సంకల్ప సభ

సంగారెడ్డి వుదయం.

సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల నుంచి భారీగా తరలిరావాలని మద్ది శ్రీనివాస్ రెడ్డి పిలుపుఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో అక్టోబర్ 30న శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభకు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి మద్ది శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఈ సభకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన యువ నాయకులు, మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా నిలవనున్న ఈ సభకు పార్టీ శ్రేణులు సమన్వయంతో తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సిమెంట్ ట్యాంకర్ మోటర్ సైకిల్ ను ఢీకొని వ్యక్తి మృతి

యాలాల అక్టోబర్ 29 వుదయం ప్రతినిధి :- సిమెంట్ ట్యాంకర్ బైక్ ఢీకొని బైక్ పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని దౌలాపూర్ గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. యాలాల ఎస్సై విట్టల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పగడాల గ్రామానికి చెందిన సతీష్ (23) గురువారం కొడంగల్ పని మీద బైక్ పై వెళ్తున్నాడు. అయితే కొడంగల్ రోడ్డు మార్గమధ్యంలో సిమెంట్ ట్యాంకర్ బైకును ఢీకొట్టడంతో మోటార్ సైకిల్ పై వెళ్తున్న సతీష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అధిక సాంద్రత పత్తి సాగుతో అధిక దిగుబడులు

బిజ్వారులో క్షేత్ర పరిశీలన, రైతులకు సాగు పద్ధతులపై అవగాహన

తాండూర్ వ్యవసాయ అధికారి కొమరయ్యలి

తాండూరు. అక్టోబర్ 29(వుదయం ప్రతినిధి) అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించే అవకాశాలు ఉన్నాయని తాండూరు మండల వ్యవసాయ అధికారి కుమారయ్య తెలిపారు. గురువారం మండలంలోని బిజ్వార గ్రామంలో మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ పథకం కింద పత్తి సాగు చేపట్టిన రైతుల పొలాల్లో క్షేత్ర పరిశీలన నిర్వహించి, క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో కోమారయ్య మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ ప్రారంభంలో రైతులకు ప్రభుత్వం ఉచితంగా రాసీ స్విఫ్ట్ 929 హైబ్రిడ్ పత్తి విత్తనాలను 256 ప్యాకెట్లు

పంపిణీ చేసిందన్నారు. సబ్సిడీపై అవసరమైన పోషక మందులు, పురుగు మందులు అందించినట్లు వివరించారు. క్షేత్ర పరిశీలనలో భాగంగా రైతులు సాగు చేసిన పత్తి పంట ఎదుగుదల, సాగు విధానాన్ని పరిశీలించారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనువైన విత్తన రకాలు, చీడపీడల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. సాధారణ సాగు పద్ధతులతో పోలిస్తే అధిక దిగుబడులు సాధించే అవకాశాలున్నాయని, శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించాలన్నారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సుమ, రాసీ కంపెనీ వికారాబాద్ మేనేజర్ నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఎల్‌నినో నేపథ్యంలో తాగునీరు, విద్యుత్తు పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి..

- గ్రామాల్లో జలసిరి పనులను వేగవంతం చేయాలి
- అధికారులకు కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశాలు

కరీంనగర్, అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి) : ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి లభ్యత, విద్యుత్తు వినియోగం విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాల నేపథ్యంలో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. తాగునీటిని అవసరమైన మేరకే వినియోగించేలా ప్రజలను అప్రమత్తం చేయాలని, విద్యుత్తును పొదుపుగా వాడుకోవడంపై గ్రామగ్రామాన విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. భవిష్యత్తులో తాగునీరు, విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో కార్యాచరణ చేపట్టాలని స్పష్టం చేశారు.

గురువారం రాత్రి కరీంనగర్ ఐడీఓసీలో వి.బి.-జీ రామ్ జీ పథకం కింద చేపడుతున్న పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో జలసిరి పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో భూగర్భ జలాల పెంపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేలా పనులు చేపట్టాలని సూచించారు.

బోర్ల రీఛార్జిపై ప్రత్యేక దృష్టి

గ్రామాల్లో తాగునీటి బోర్ల రీఛార్జికి చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ, ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా చైతన్యపరచాలన్నారు. జలసిరి పనులు లక్ష్యానికి అనుగుణంగా పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

విద్యుత్తు పొదుపు అందరి బాధ్యత

రాబోయే రోజుల్లో విద్యుత్తు వినియోగం, సరఫరాకు సంబంధించి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. గృహ వినియోగదారులతో పాటు వ్యాపారులు, వాణిజ్య సంస్థలు, వర్తక సంఘాలు విద్యుత్తును పొదుపుగా వినియోగించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రజల్లో బాధ్యతాయుత వినియోగంపై అవగాహన పెంపొందించాలని సూచించారు.

పశువులకు నీరు, పశుగ్రాసం కొరత రాకూడదు

పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కనీస అవసరాలైన తాగునీరు, విద్యుత్తు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

అభివృద్ధి పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ

జిల్లా పంచాయతీ అధికారులు అంగన్‌వాడీ భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, మహిళా సంఘాల భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులు అభివృద్ధి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వీబీజీ రామ్ జీ పథకం కింద వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు మత్స్యశాఖకు సంబంధించిన రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ కార్యక్రమాన్ని చేపట్టాలని, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ భవనాలు, హాస్టళ్లు, సామూహిక అపార్ట్‌మెంట్లతో పాటు నీటి నిల్వకు అనువైన వివిధ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, డీఆర్‌డీవో గీత, డీపీవో జగదీశ్వర్, పీఆర్ ఈఈ జనార్దన్‌తో పాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన జిల్లా బాలల సంరక్షణ విభాగం

– చెన్నై నుంచి బాలుడిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగింత

వుదయం, సిద్దిపేట / వర్గల్ ప్రతినిధి

తప్పిపోయిన బాలుడిని చెన్నై నుంచి సురక్షితంగా తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించిన సిద్దిపేట జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు మానవత్వాన్ని చాటుకున్నారు.

వర్గల్‌కు చెందిన డొక్కా శేఖర్ అనే బాలుడు తప్పిపోయి తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ఉన్నట్లు సుమారు 20 రోజుల క్రితం అక్కడి బాలల సంరక్షణ విభాగం నుంచి జిల్లా బాలల సంరక్షణ అధికారి రాముకు సమాచారం అందింది. దీంతో ఆయన వెంటనే స్పందించి బాలుడి కుటుంబానికి సమాచారం అందించేందుకు బాలల సంరక్షణ అధికారి రాజును తల్లిదండ్రుల వద్దకు పంపించారు. బాలుడు చెన్నైలో ఉన్నాడని, అక్కడికి వెళ్లి తీసుకురావాలని సూచించారు. అయితే దూరం కారణంగా తాము చెన్నైకి వెళ్లలేమని తల్లిదండ్రులు తెలిపారు.

దీంతో జిల్లా బాలల సంరక్షణ అధికారి రాము చెన్నై బాలల సంరక్షణ అధికారులతో సమన్వయం చేసుకుని, అవసరమైన ఏర్పాట్లు చేసి బాలుడు శేఖర్‌ను ఎస్కార్ట్ ద్వారా సిద్దిపేటకు తీసుకొచ్చారు. అనంతరం గురువారం బాలల సంక్షేమ సమితి ద్వారా బాలుడిని కన్నవారైన డొక్కా వెంకటయ్య, మైసమ్మలకు అప్పగించారు. చాలా రోజుల తర్వాత తమ కుమారుడిని చూసిన తల్లిదండ్రులు ఆనందంతో కన్నీళ్లు పెట్టుకున్నారు. తమ కుమారుడిని తిరిగి తీసుకురాగలమని అనుకోలేదని, అధికారుల చొరవతో శేఖర్‌ను తిరిగి చూసే అవకాశం కలిగిందని భావోద్వేగానికి గురయ్యారు. జిల్లా బాలల సంరక్షణ విభాగానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిన నర్సింలు, మంజుల, అంజమ్మ, బాలల సంరక్షణ అధికారి రాజు, తమిళనాడు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సింగూర్ నీటి నిర్వహణ నుంచి రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల వరకు.. నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వినతి

సంగారెడ్డి వుదయం

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి, దాని ప్రభావంతో ప్రజలకు, రైతులకు కలిగే నష్టాలను ముందుగానే అరికట్టేలా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కోరారు...సంగారెడ్డి నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, తాగునీరు, సాగునీరు, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చించారు.. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి, తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పలు సమస్యలపై ప్రజలను నేరుగా కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి, వారి ఇబ్బందులను వివరించారు.సింగూర్ ప్రాజెక్టు నీటి నిర్వహణలో ముందస్తు ప్రణాళిక, దూరదృష్టి లోపించడం వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాలో తీవ్రమైన తాగునీటి సమస్య తలెత్తే పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం ఉంటుందని తెలిసినప్పటికీ, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటిని వినియోగించడంలో తగిన ప్రణాళికలు రూపొందించలేదని అన్నారు. సముద్రాలపై వంతెనలు నిర్మించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ప్రస్తుత కాలంలో, సింగూర్ ఆనకట్ట రివెట్‌మెంట్ మరమ్మతుల కోసం ప్రత్యామ్నాయ ఆధునిక సాంకేతిక పద్ధతులను ఎందుకు వినియోగించలేదని అన్నారు. హనుమాన్ నగర్, చేర్యాల, ఆరుట్ల, బ్యాతల్ గ్రామాలకు సంబంధించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలని కోరారు. ఇళ్ల నిర్మాణం కోసం స్థలం ఇచ్చిన వారికి లబ్ధిదారుల ఎంపికలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా పూర్తికాని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన నిధులు మంజూరు చేసి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట కొత్త బోర్లు వేయడంతోపాటు ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.రైతులకు ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం కింద సరఫరా అవుతున్న విద్యుత్‌తో వ్యవసాయ బోర్ల ద్వారా తోడుతున్న నీటిని బీర్ ఫ్యాక్టరీలకు సరఫరా చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రస్తావించారు. అంశాలపై సంబంధిత అధికారులు విచారణ జరపాలని కోరారు. బీర్ ఫ్యాక్టరీలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే వర్తించే చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.బొబ్బిలిగామ, ఏటిగడ్డ సంఘం, మాలపాడు గ్రామాల మీదుగా వెళ్లే రహదారులు పూర్తిగా ధ్వంసమై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ రహదారులకు కనీసం వెట్‌మిక్స్‌తోనైనా తక్షణ మరమ్మతులు చేపట్టి ప్రజలకు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు.అలాగే రేజింతల్ రోడ్డు, అనంతసాగర్ నుంచి సైదాపూర్ రోడ్డు, సిద్దాపూర్ నుంచి మారేపల్లి రోడ్డు సహా నియోజకవర్గంలోని పలు రహదారులు అధ్వానంగా మారాయని వివరించారు. గుంతలు, గతుకులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నందున సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, దెబ్బతిన్న రహదారులను గుర్తించాలని కోరారు. వెట్‌మిక్స్, అవసరమైన ఇతర మరమ్మతు పనులు చేపట్టి రహదారులను ప్రయాణానికి అనువుగా మార్చాలని సూచించారు.సంగారెడ్డి నుంచి మదీనాగూడ వరకు జాతీయ రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. అక్టోబర్‌లోగా పూర్తికావాల్సిన పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, పనుల్లో జాప్యానికి కారణాలను గుర్తించి, నిర్మాణ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు..

వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా గత ఏడాదికి సంబంధించిన సన్న వడ్ల బోనస్ కింద రైతులకు చెల్లించాల్సిన రూ.500 బకాయిలు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అర్హులైన రైతులకు బకాయిలను త్వరితగతిన చెల్లించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని, నాణ్యమైన విద్యుత్ అందక వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని, పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కుల పంపిణీలో జరుగుతున్న జాప్యాన్ని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా పెండింగ్‌లో ఉన్న చెక్కులను త్వరితగతిన పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.సంగారెడ్డి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 823 ప్రతిపాదనలు సమర్పించగా, ఇప్పటివరకు 207 ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. మిగిలిన 616 ఇళ్లను కూడా అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేసి పేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చాలని కలెక్టర్‌ను కోరారు.నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా తొమ్మిది ఎస్సీ కమ్యూనిటీ భవనాలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరారు. ఈ భవనాల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వి.బి.-జి. రామ్‌జీ పథకం కింద నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే సమర్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన పనులను గుర్తించి, నిధులు మంజూరు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, రహదారులు, విద్యుత్, గృహ నిర్మాణాలు, రైతుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన అంశాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు ఎమ్మెల్యే వివరించారు. ప్రజల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకుని, వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, పూర్తికాని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరారు.

రక్త దానం చేసిన కిశోర్, మనీష్ గౌడ్

సంగారెడ్డి వుదయం

ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఆపరేషన్ కోసం అత్యవసరంగా బి పాజిటివ్

రక్త దానం చేసి మానవత్వం చాటుకున్నాడు రెవిన్యూ ఉద్యోగి బి. కిశోర్, బి. ఆర్. యస్ నాయకుడు మనీష్ గౌడ్..

సంగారెడ్డి మండలం చెందిన వ్యక్తి ప్రమాదంలో గాయపడి కాలుకు గాయమై ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు..రోగిని పరీక్షించిన వైద్యుడు ఆపరేషన్ కోసం బి పాజిటివ్ బ్లడ్ గ్రూప్ కావాలి అని అన్నారు.దింతో కుటుంబ సభ్యులు జగన్ వెంటనే బ్లడ్ డోనార్స్ క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణ ను సంప్రదించాడు బంగారు కృష్ణ వెంటనే వాట్సాప్ గ్రూపులో షేర్ చేయగానే స్పందించిన బి కిశోర్, మనీష్ గౌడ్ వెంటనే బ్లడ్ బ్యాంకు కు వచ్చి రక్త దానం చేసి మానవత్వం చాటుకున్నారు ఈ సందర్బంగా బ్లడ్ డోనార్స్ క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణ మాట్లాడుతూ రెవిన్యూ ఉద్యోగి కిశోర్ 26 వ సారి, మణిష్ గౌడ్ 2 వ సారి రక్త దానం చేయడం అభినందనియం అన్నారు.. చాలా మంది రక్త దానం చేస్తే బలహీన పడుతాము అని అనుకుంటారు కానీ రక్త దానం చేయడం వల్ల మన శరీరంలో ఉన్న పాత రక్తం పోయి కొత్త రక్తంతో మరింత ఆరోగ్యంగా ఉంటారు అన్నారు.. ఈ సందర్బంగా రక్త దాతలు కిశోర్, మనీష్ ను బ్లడ్ డోనార్స్ క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణ,జగన్ సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంకు ఇంచార్జి ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి కంతారెడ్డి తిరుపతిరెడ్డి ఆర్థిక సాయం

(వుదయం ప్రతినిధి)పాపన్నపేట, అక్టోబర్ 29

పాపన్నపేట మండలంలోని అబ్లాపూర్ గ్రామానికి చెందిన ముమ్మని బాలయ్య అకాల మరణం పట్ల బీఆర్ఎస్ నాయకుడు కంతారెడ్డి తిరుపతిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు తన తరపున రూ.5 వేల ఆర్థిక సాయాన్ని గ్రామ బీఆర్ఎస్ నాయకుల ద్వారా అందజేశారు.

ఈ కార్యక్రమంలో అబ్లాపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు కానాపురం లింగంగౌడ్, కొంపల్లి కిష్టయ్య, ముమ్మని బాగయ్య, ముమ్మని నర్సింలు, చాకలి కుమార్, శేగ్గరి నర్సింలు, శేగ్గరి రమేష్‌గౌడ్, సీతానగరం నరేష్, చీకోటి ఎల్లప్పతోపాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలి

.. అదనపు కలెక్టర్ పాండు

ఘనంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహణ

సంగారెడ్డి, అక్టోబర్ 29: -వుదయం యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకొని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ పాండు అన్నారు. జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియం లో జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఘనంగా ఉత్సాహ భరితంగా జరిగాయి .

ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ ఉత్సవాల్లో సుమారు 400 మంది యువ కళాకారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, స్వామి వివేకానందుడు యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తిని పెంపొందించేందుకు చేసిన బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. వివేకానందుడు 1893లో అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మతాల పార్లమెంటులో అమెరికా సోదరీమణులారా, సోదరులారా అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని తెలిపారు. యువత తమలోని ప్రతిభను వెలికితీసి, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు కళలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలన్నారు. యువజనోత్సవాలు యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చక్కని వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. స్వామి వివేకానందుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని, సమాజ సేవతో పాటు దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో భాగంగా జానపద నృత్యం, జానపద గేయం, వీధి నాటకం, తదితర కళాంశాల్లో పోటీలు నిర్వహించారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు తమ ప్రతిభను ప్రదర్శించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు, అక్కడ ప్రథమ స్థానం పొందిన వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని అధికారులు తెలిపారు.వచ్చే జనవరిలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు యువత తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి సంబంధిత అధికారులు, యువ కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేలా ఉద్యాన పంటల సాగు!

కోహీర్, అక్టోబర్ 29 (వుదయం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండలం వెంకటాపూర్ గ్రామంలో ఉద్యాన పంటల సాగు, నీటి యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ సహకారంతో రెడ్డి ఎస్ ఫౌండేషన్, జహీరాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త భాగస్వామ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఉద్యాన పంటల సాగులో మెరుగైన ఫలితాలు సాధించే విధానాలపై రైతులకు వివరించారు.

ఉద్యాన పంటలకు అవసరమైన నీటి పరిమాణం, పంట ఎదుగుదలలోని వివిధ దశలకు అనుగుణంగా నీటిని అందించే విధానం, నీటి వృథాను అరికట్టే పద్ధతులపై అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా పంటలకు అవసరమైన తేమను అందిస్తూ నీటి కొరతను అధిగమించవచ్చని వివరించారు.ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలను సాగు చేయడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక, పంటల నిర్వహణ, నీటి పొదుపు చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా వ్యవసాయంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ మెరుగైన ఫలితాలు సాధించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నవీన్ కుమార్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.